సీన్ రివర్స్

అభ్యర్థులకు తలనొప్పిగా మారిన జగన్ వ్యూహం





అభ్యర్థుల ఎంపికలో వైసీపీ అనుసరించిన బదిలీల వ్యూహం పార్టీకే తలనొప్పిగా మారింది. ఆ పార్టీ తరపున ఎన్నికల్లో బరిలోకి దిగుతున్న వారి అనుచరులు కొత్త నియోజకవర్గాలకు చేరిపోయారు. దీంతో వేరేచోట నుంచి వచ్చిన అభ్యర్థి కొత్త కావడంతోపాటు, ఆయన అనుచరుల ఆధిపత్యాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. మా మీద పరాయి పెత్తనం ఏంటంటూ ఎదురు తిరుగుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యేతోపాటు ఆయన వర్గీయులు వేరేచోటకు వెళ్లడంతో వారి నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థికి చిక్కులు ఎదురవుతున్నాయి. దీంతో ఒక నియోజకవర్గంలో నాయకుల కొరత సమస్య కాగా, మరోచోట పెత్తనం చేసే వారు కొత్త కావడం సంకటంగా మారింది. ఫలితంగా మొదటికే మోసం వస్తుందని వైసీపీ అభ్యర్థులు భయపడిపోతున్నారు. మొత్తంగా బదిలీలతో స్థానిక అసంతృప్తులకు బ్రేక్ వేయాలనుకున్న జగన్ వ్యూహం రివర్స్ అవుతుందన్న ఆందోళన పెరిగిపోయింది.

- ఒక సెగ్మెంట్‌లో కొత్త నాయకులు.. మరోచోట కొరత
- మాపై పరాయి పెత్తనం ఏంటంటూ ప్రశ్నలు
- ముందు నడిచే నాయకుడు లేక ఇంకోచోట ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో వైసీపీ కొన సాగించిన బదిలీల తంతు తలనొప్పిగా మారింది. ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జులపై ఉన్న అసంతృప్తి, అసమ్మతులను తొలగించేందుకు ఈ బదిలీల పర్వానికి శ్రీకారం పలికిన విషయం విదితమే. జగన్ ప్రత్యేక దృష్టితో ఆ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఒంగోలు మినహా మిగిలిన అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థిని మార్చడం ఆ వ్యూహంలో భాగమే. కొత్త వారిని రెండు, మూడు చోట్ల మాత్రం రంగంలోకి తీసుకొచ్చి మిగిలిన చోట్ల ఆపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులనే అటుఇటు మార్చారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే అయిన మంత్రి సురేష్‌ను కొండపి, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మంత్రి నాగార్జునను సంతనూతలపాడుకు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరుకు, మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుని మార్కాపురానికి మార్పు చేసిన విషయం తెలిసిందే. దర్శికి మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిని రంగంలోకి తీసుకురాగా, వైపాలెం, అద్దంకి, పర్చూరు అసెంబ్లీ స్థానాలకు స్థానికేతర నాయకులకు టికెట్లు కేటాయించారు. చీరాలలో వెంకటేష్‌కు, కనిగిరిలో ఒక జడ్పీటీసీ సభ్యుడికి అవకాశం ఇచ్చారు.

ఇటు కొత్త... అటు కొరత

ఆయా నియోజకవర్గాల్లో తాజా పరిస్థితిని పరిశీలిస్తే బదిలీల వ్యవహారం ఆ పార్టీకి ఎంత తలనొప్పిగా మారిందో అర్థమవుతుంది. వైపాలెంకు చెందిన మంత్రి సురేష్ కొండపిలో పోటీ చేయగా, కొండపి నియోజకవర్గానికి చెందిన చంద్రశేఖర్ వైపాలెంలో పోటీలో ఉన్నారు. ఇంతవరకు వైపాలెంలో మంత్రి సురేష్, అభ్యర్థి చంద్రశేఖర్ కలిసి ప్రచారంలో పాల్గొన్న దాఖలాలు లేవు. నియోజకవర్గంలో వైసీపీలో ఉన్న బలమైన నాయకులు ఒక్కొక్కరుగా టీడీపీలో చేరిపోతున్నారు. మంత్రి సురేష్ అనుకూల, వ్యతిరేక గ్రూపుల సమన్వయంలో చంద్రశేఖర్ వ్యూహం చతికిల పడింది. మంత్రి సురేష్ తరఫున ఎర్రగొండపాలెంలో పనిచేసే వారంతా కొండపి చేరారు. వారి తీరు, కీలక అంశాల్లో పెత్తనాన్ని కొండపి నాయకులు భరించలేక పోతున్నారు. చాలామంది వైసీపీ కిందిస్థాయి నాయకులు సైలెంట్ అయిపోవటం అందుకు నిదర్శనం. ఇక కొండపి ఇన్‌చార్జిగా ఉన్న అశోక్‌బాబును బాపట్ల జిల్లా వేమూరు బదిలీ చేయడంతో గ్రామాల్లో కీలకంగా వ్యవహరించే ఆయన అనుచరులంతా వేమూరులో పనిచేస్తున్నారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా కందుకూరు నియోజకవర్గంలో పోటీలో ఉండగా ఆయన అనుచరులు అక్కడే తిరుగుతున్నారు. కనిగిరిలో పోటీలో ఉన్న నారాయణను బొమ్మను చేసి కొందరు నాయకులే పెత్తనం చేయడంతో శ్రేణులంతా పోలోమని టీడీపీలో చేరిపోతున్నారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చి ఎస్ఎన్‌పాడులో పోటీ చేస్తున్న మంత్రి నాగార్జున పరిస్థితీ అంతే. చీమకుర్తి మండలంలో కీలకంగా వ్యవహరించే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శిలో రంగంలో ఉండటంతో చక్రం తిప్పే నేతలంతా ఆ నియోజకవర్గానికి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఇంత వరకూ ప్రచారంలోకి రాకపోవడంతో ఆయన వర్గంలోని అత్యధికులు నాగార్జునకు దూరంగా ఉన్నారు. నాగార్జున తరఫున వేమూరు నుంచి వచ్చి పెత్తనం చేస్తున్న వారి చర్యలు సరికొత్త సమస్యను సృష్టిస్తున్నాయి. అద్దంకిలో గుంటూరు జిల్లా నుంచి వచ్చిన హనిమిరెడ్డి తరఫున ఆయన కుటుంబ సభ్యుల పెత్తనం స్పష్టంగా కనిపిస్తోంది. పర్చూరు నియోజకవర్గంలో రంగంలో ఉన్న బాలాజీ చీరాల వాసి కావడంతో అక్కడున్న పరిస్థితుల నేపథ్యంలో పర్చూరులోని ఆమంచి వర్గీయులు ఎవరూ ఆయనకు సహకరించడం లేదు. ఇలా జగన్ అమలు చేస్తున్న బదిలీల తంత్రం ఆయా నియోజవకర్గాల్లో వికటించడం ప్రారంభమైంది.

గిద్దలూరులో వైసీపీకి దూరమవుతున్న నాయకులు

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు నుంచి రంగంలోకి దించారు. దీంతో ఇప్పటివరకు తన నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించిన ఆయన కుటుంబ సభ్యులు, వారికి ఉన్న ముఖ్యనాయకులు గిద్దలూరుకు చేరారు. కొనకనమిట్ల మండలంలో వైసీపీపై పెత్తనం చెలాయించే మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి దగ్గర నుంచి మార్కాపురం, పొదిలి మండలాల్లో కూడా వైసీపీ పక్షాన ఎన్నికల సమయం లో కీలక బాధ్యతలు చూసే వారంతా గిద్దలూరులో మకాం వేశారు. దీంతో మార్కాపురం నుంచి రంగంలోకి వచ్చిన అన్నా రాంబాబు, కొన్ని మండలాలు గ్రామాల్లో కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిద్దలూరు నుంచి రాంబాబు అనుచరులు మార్కాపురం వచ్చింది తక్కువే అయినా రెండుచోట్ల మార్పిడి సక్రమంగా కనిపించటం లేదు. కిందిస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించే నాయకులు, అభ్యర్థులతో అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. గిద్దలూరులో అభ్యర్థి స్థానికుడు కాదు. పైగా ఆయన తరఫున పెత్తనం చేసేవారంతా పరాయి వారే. దీన్ని మేము భరించలేమంటూ వైసీపీ నాయకులు ఆ పార్టీకి దూరమవుతున్నారు.

మేయర్ చేసిన పనికి ఉద్యోగులు బలి!

- ఆమె ఇంటికి తాయిలాలకు వెళ్లినందుకు జేసీ సీరియస్
- సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా అధికారం అడ్డుపెట్టుకుని మేయర్ గంగాడ సుజాత పంచిన ఎన్నికల బహుమతులపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సీరియస్ అయ్యారు. ఈ మేరకు సమావేశం పేరుతో మేయర్ ఇంటికి వెళ్లిన సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. 'మేయర్.. నిబంధనలు బేఖాతర్' అన్న శీర్షికన మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై జేసీ స్పందించారు. కార్పొరేషన్ అధికారులు, ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వివరాల్లోకెళితే.. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే ఆ తర్వాత మేయర్ కార్యాలయం నుంచి సచివాలయ కార్యదర్శులకు సమావేశం ఉందని సెల్‌ఫోన్‌లకు మెస్సేజ్‌లు అందాయి. దీంతో మేయర్ నివాసానికి వెళ్లిన వారికి ఎన్నికల్లో బాగా పనిచేయాలని, వైసీపీ గెలుపు కోసం కృషిచేయాలని వస్త్రాలు, గిఫ్టులు ఇచ్చి మరీ కోరారు. నగరంలోని 70 సచివాలయాలలో పనిచేస్తున్న 700 మంది సెక్రటరీలు ఆ సమావేశానికి హాజరు కాగా, ఓ పది మంది మాత్రమే ఆమె తీరును వ్యతిరేకిస్తూ బయటకు వచ్చేశారు. మిగిలిన సెక్రటరీలకు సీఎంతోపాటు, ఎమ్మెల్యే బాలినేని బొమ్మతో ముద్రించిన సంచులలో వస్త్రాలు, ఇతర విలువైన వస్తువులు బహుమతిగా ఇచ్చారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి శనివారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై జేసీ.. కార్పొరేషన్ కమిషనర్ జశ్వంతరావును, ఆర్డీవో సుబ్బారెడ్డిని పిలిపించి సీరియస్ అయినట్లు సమాచారం. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వారంతా సచివాలయ సెక్రటరీలు కాదని, వలంటీర్లు అని తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఆవెంటనే జేసీ తన దగ్గర ఉన్న వీడియో, ఫొటోలను చూపి మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో కమిషనర్ హడావుడిగా ఓ ఏడుగురు సెక్రటరీల పేర్లు రాసి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.


మేయర్ ఇంటి నుంచి బహుమతులు తీసుకొని వెళ్తున్న కార్యదర్శులు (ఫైల్)

మేమే తప్పు చేశామా..?

'కోడ్ అమలులో ఉన్నప్పటికీ సమావేశం పేరుతో తమను మేయర్ ఇంటికి పిలిపించుకుని మరీ గిఫ్టులు ఇచ్చారు. అది కాక వలంటీర్లు, ఆర్పీలు, అంగన్‌వాడీలు ఇలా అందరికీ రూ.5వేలు ఇచ్చారట. వారిపై ఎలాంటి చర్యలు లేవు. కానీ మాకు మాత్రం వస్త్రాలు ఇచ్చి సరిపెట్టగా అవి తీసుకున్నందుకు మేం బలిపశువులమయ్యాం' అని పలువురు సెక్రటరీలు వాపోతున్నారు. తమను ఇలా బాధ్యులను చేయడం ఎంతవరకు సబబని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, తమను పిలిచిన మేయర్‌పై చర్యలు ఎందుకు తీసుకోరని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. తమను సమావేశానికి వెళ్లాలని ఆదేశించిన సచివాలయ అడ్మిన్లు, కార్పొరేషన్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోరని సెక్రటరీలు సచివాలయాల్లో మాట్లాడుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


ఉషారాణికి బొకే ఇస్తున్న డీపీవో కార్యాలయ సిబ్బంది

ఇన్‌చార్జి డీపీవోగా ఉషారాణి బాధ్యతల స్వీకరణ

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 18 : జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీపీవోగా పనిచేస్తున్న జీవీనారాయణరెడ్డిని రిలీవ్ చేస్తూ ఆదివారం రాత్రి కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జిగా ఉషారాణిని నియమించడంతో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెను జిల్లా పంచాయతీ కార్యాలయ పరిపాలనా అధికారి శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జి.రామకృష్ణతోపాటు పలువురు ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా మాధురి బాధ్యతల స్వీకరణ

జాలిరెడ్డి రిలీవ్

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 18 : జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా కె.మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జాలిరెడ్డిని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం రాత్రి రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో ఐసీడీఎస్ పీడీగా పనిచేస్తున్న మాధురికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఉదయం జడ్పీ కార్యాలయంలో జాలిరెడ్డి నుంచి మాధురి బాధ్యతలు స్వీకరించారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

- బీఎన్ సమక్షంలో పార్టీ తీర్థంపుచ్చుకున్న బూసరపల్లిలోని పలు కుటుంబాలు

చీమకుర్తి, మార్చి 18: అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యపడుతుందని టీడీపీ ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బూసరపల్లిలో సోమవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు గ్రామంలో ఘనస్వాగతం లభించింది. వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. షైనం నరసమ్మ, మందల కేశవ, మేకం వెంకటేశ్వర్లు, మేకం కోటేష్ తదితర 30 కుటుంబాల వారు టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. వారందరికీ విజయ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతించారు. తదుపరి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్, మన్నం ప్రసాద్, మాజీ సర్పంచ్ బచ్చుల వెంకటేశ్వర్లు, రాజా, లోకేష్, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, కాట్రగడ్డ రమణయ్య పాల్గొన్నారు.


బూసరపల్లిలో పార్టీలో చేరిన వారితో బీఎన్ విజయ్‌కుమార్


ఒంగోలులోని ఓ కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా పది పరీక్షలు

- 29,317 మంది విద్యార్థులు హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 18 : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజైన సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 170 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 30,082 మందికిగాను 29,317 మంది విద్యార్థులు హాజరయ్యారు. 765మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల ప్రధాన ద్వారాల వద్దనే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలికి అనుమతించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు అత్యవసరాల కోసం వైద్యశాఖ సిబ్బందిని నియమించారు. విద్యార్థులకు మంచినీరు, టాయిలెట్ సౌకర్యం కల్పించారు. పూర్తిస్థాయిలో కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేశారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు 48 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షల పరిశీలకులు ప్రసన్నకుమార్, డీఈవో డి.సుభద్ర ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు 60 కేంద్రాలను సందర్శించారు. మొదటిరోజు కావడంతో విద్యార్థులు ముందుగా ఆలయాలకు వెళ్లి పూజలు చేసి పరీక్షకు హాజరయ్యారు.


ఒంగోలులోని ఓ కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు


పరీక్షకు వెళ్లే ముందు ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థినులు



ఒంగోలులో గోడలపై ఉన్న వైసీపీ ప్రచార పోస్టర్లు

తొలగింపు.. తలనొప్పి!

- కోడ్ అమలులో ఉన్నా యథేచ్ఛగా ఉల్లంఘన
- సచివాలయాల్లో అలాగే సీఎం బొమ్మలు
- కార్పొరేషన్ అధికారులకు తప్పని తిప్పలు
- ఇంకా నగరంలో పోస్టర్లు, వైసీపీ రంగులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : వైసీపీ నేతల ప్రచార పిచ్చి పాడుగాను.. వాటిని తొలగించడానికి మున్సిపల్ సిబ్బంది నానా అగచాట్లు పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు ఐదేళ్లుగా శిలాఫలకం నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, ఇలా ఖాళీగా ఏమి కనిపించినా పులిమేసిన వైసీపీ రంగులు ఇప్పుడు అధికారులకు తలనొప్పిగా మారాయి. ఈనెల 16వతేదీ నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బొమ్మలు, విగ్రహాలు కనిపించకుండా చేయాల్సి ఉంది. అయితే అది ఇప్పుడు కార్పొరేషన్ అధికారులకు పెద్దపనిగా మారింది. సాధారణ విధులను సైతం వదిలేసి, గల్లీగల్లీ తిరిగి రాజకీయ రంగులు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించే పనిలో ఉన్నారు. ఒకట్రెండు అయితే ఎలాగోలా తొలగించొచ్చు. నగరంలో వైసీపీ ప్రచార పిచ్చితో ఇప్పుడు పదిరోజులు పనిచేసినా పూర్తిస్థాయిలో నియంత్రించే పరిస్థితి కనిపించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ఒకవైపు వెంటనే తొలగించకుంటే ఎన్నికల కమిషన్ చర్యలకు బలైపోతామన్న భయం, తొలగించడానికి సమయం సరిపోకపోవడం వెరసి అధికారులకు సంకటంగా మారింది. రెండురోజులుగా వారు నానా అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకించి ఇటీవల నగరంలో ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయం కావడంతో పలు అభివృద్ధి పనులకు సంబంధించి విచ్చలవిడిగా శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. వాటితోపాటు కార్యాలయాలకు వైసీపీ రంగులు పులిమేశారు. అంతేకాకుండా ఇటీవల నగరంలో వైసీపీకి ఓటు వేయాలంటూ పార్టీ నేతలు చెవిరెడ్డి, బాలినేనిల ఫొటోలతో వేలసంఖ్యలో పోస్టర్లు అంటించారు. వాటిని తొలగించడానికి ఇప్పుడు అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంచితే కొన్ని సచివాలయాలకు వైసీపీ రంగులు వేశారు. ఇప్పుడు వాటిని తొలగించాలంటే తెల్లరంగు వేయాల్సి ఉంది. అందుకు ఏ నిధులు ఖర్చుచేయాలో అర్థంకాని పరిస్థితిల్లో అధికారులు తలపట్టుకు కూర్చున్నారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అధికారపార్టీ నేతల ఆదేశాలతో అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


హౌసింగ్ బోర్డు సచివాలయ భవనంపై ఉన్న సీఎం బొమ్మ, వైసీపీ రంగులు



ఒంగోలు వడ్డెపాలెం సమీపంలో తొలగించని వైసీపీ ఫ్లెక్సీ

ఇద్దరు చిన్నారులను మింగిన క్వారీ

- ఈతకు దిగి మృత్యువాత
- బలిజేపల్లి గిరిజనగూడెంకు సమీపంలో ఘటన
- మృతులు దోర్నాలలోని ఇందిరానగర్ వాసులు

వివరాలు మెయిన్‌లో..


చిన్నారులు వలి, ప్రసన్నకుమార్ మృతదేహాలు


మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు(కల్చరల్) మార్చి 18:ఎన్నికల సమయంలో భారత ఎన్నికల కమిషన్ విధించే నిబంధనలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని, నిబంధనల ప్రకారం పనిచేయకపోతే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు ఎన్నికల నిబంధనలపై ఆయన పలు సూచనలు చేశారు. సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేరయ్య మాట్లాడుతూ ఉద్యోగులు ఏ పార్టీ ప్రచారంలో పాల్గొనకూడదని, అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయంలో ప్రధాని, ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల చిత్రపటాలు ప్రదర్శించకూడదని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గ్రంథాలయానికి వచ్చే యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, కె.కృష్ణవేణి, ఎస్.అనిల్ బాబు, ఎం.శివకుమారి, లక్ష్మి, జి.శాంసన్, వై.మృదుల్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


సీఐటీయూ ఆఫీసు బేరర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మతోన్మాద పార్టీని వ్యతిరేకించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : కేంద్రంలోని మతోన్మాద బీజేపీని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశానికి కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు వ్యతిరేక చట్టాలను తెచ్చారని అన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు. 2019 మోటార్ వెహికల్ చట్టం, 2020 విద్యుత్‌చట్టం, హిట్‌అండ్ రన్ చట్టం, ఉపాధి హామీ నిర్వీర్యం, సీఏఏ, ఎలక్ట్రోరల్ బాండ్లు, ధరలు పెరుగుదల, ఫెడరల్ వ్యవస్థను నాశనం చేయడం తదితర విషయాలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలో కూడా కుట్రపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎం. రమేష్, జి. శ్రీనివాసులు, జీవీ కొండారెడ్డి, బంకా సుబ్బారావు, జీవీ రాగయ్య, పీసీ కేశవరావు, ఈదర అన్నపూర్ణ, పారా శ్రీనివాసరావు, రంగారావు, రఫీ, టి. మహేష్, చిరంజీవి, ఆంజనేయులు, ఆవులయ్య తదితరులు ఉన్నారు.

మూల్యాంకనానికి గైర్హాజరైన 74మందికి తాఖీదులు

● రోజుకు వెయ్యి రూపాయల అపరాధ రుసుం

ఒంగోలు(విద్య), మార్చి 18 :ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, గణితం, పౌరశాస్త్రం జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. మూల్యాంకనానికి ఇంటర్మీడియేట్ విద్యా మండలి 405 మంది అధ్యాపకులను నియమించింది. వీరిలో 331 మంది అధ్యాపకులు విధులకు హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని ఆర్‌ఐవో సెమన్ విక్టర్ పత్రికా ప్రకటనా ద్వారా హెచ్చరికలు జారీ చేసినా అధ్యాపకులు పట్టించుకోలేదు. దీంతో వీరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్‌ఐవో ఈ 74 మందికి నోటీసులు జారీ చేశారు. గైర్హాజరైన అధ్యాపకులు రోజుకు వెయ్యి రూపాయాలు అపరాధ రుసుంగా బోర్డుకు చెల్లించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులైతే సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులే అపరాధ రుసుం చెల్లించాలి. విధులకు హాజరు కాని అధ్యాపకులు పనిచేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి కళాశాల గుర్తింపును బోర్డు రద్దు చేస్తుందని ఆర్‌ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్స్ ఆ అధ్యాపకులను రిలీవ్ చేసి మూల్యాంకన విధులకు పంపించాలని ఆయన కోరారు.

వైసీపీకి ఆర్యవైశ్యులు గుణపాఠం చెప్పాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్

15వ డివిజన్‌లో భారీగా టీడీపీలో చేరిన వైశ్యులు


టీడీపీలో చేరిన ఆర్యవైశ్యులతో దామచర్ల, మాగుంట రాఘవరెడ్డి తదితరులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్య వైశ్యులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేశారని, త్వరలో జరిగే ఎన్నికల్లో వైశ్యులంతా ఒక్కటై తెలుగుదేశం పార్టీని గెలిపించి, వైసీపీ తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. సోమవారం నగరంలోని 15వ డివిజన్ సంతపేటకు చెందిన వైసీపీ సానుభూతిపరులైన వైశ్యులు తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విచ్చేసిన వారిని దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ సైకో జగన్ సీఎం అయ్యాక ఆర్యవైశ్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వ్యాపార , రాజకీయంగా అణచివేసి, కేవలం వైశ్యులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని అన్నారు. తెలుగుదేశం హయాంలో వైశ్యులకు పెద్దపీట వేయడంతోపాటు అన్ని విధాలుగా సంక్షేమం, అభివృద్ధి అందించినట్లు తెలిపారు. ఇప్పటికే నగరానికి చెందిన పలువురు వ్యాపారులు, వైశ్యులు టీడీపీలో చేరుతున్నారన్నారని, అభివృద్ధి, సంక్షేమం చేసే టీడీపీ వైపు అడుగులు వేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మరి కొద్దిరోజుల్లో జరిగే ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలన్నారు.

అలాగే ఇటీవలే తెలుగుదేశం పార్టీలో చేరిన ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ విజ్ఞులైన ఓటర్లు టీడీపీకి ఓటు వేయాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించి, సంక్షేమాన్ని సాధించుకోవాలని, మాగుంట కుటుంబం తరుపున తాము వైశ్యులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు కనమర్లపూడి హరిప్రసాద్, కొంకిమళ్ళ శ్రీనివాసరావు, ముప్వల నాగరాజు, నూకల శ్రీనివాసరావు, దేవకి శ్రీనివాసరావు, పి. రవికుమార్‌తో పాటు పలువురు యువత పార్టీలో చేరగా, టీడీపీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, కొప్పురావూరి సురేష్, పలువురు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దినేష్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియామావళిని తప్పనిసరిగా పాటించి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నిర్వహణలో అధికార పాత్ర ఎంతో ఉందో, రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు పూర్తిగా అవగాహనతో ప్రవర్తనా నియామావళిని పాటించాలన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినందున పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న పర్సన్స్‌కు సంబంధించిన ఫొటోలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాల్లో పూర్తిగా ఎన్నికల నిబంధనల మేరకు తొలగించామన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయా పార్టీల పాలసీలు మాట్లాడుకోవచ్చని, కానీ వ్యక్తిగతంగా విమర్శలకు పాల్పడరాదన్నారు. ఎలాంటి హింసాత్మక సంఘటనలకు తావులేకుండా ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు రాజకీయ పార్టీలు ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా లౌడ్ స్పీకర్లను వినియోగించాలన్నారు. రాత్రి పది నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ఇచ్చే సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పని సరిగా జిల్లాలో మీడియా సర్టిఫికేషన్ అర్ మానటరింగ్ కమిటీ ద్వారా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఏ కార్యక్రమమైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదన్నారు. సభలు, సమావేశాలు, వాహనాలకు ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్, కాలేషా బేగ్, రసూల్ బాషా, ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

తనిఖీల సమయంలో సమన్వయంతో పనిచేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, బంగారం, వెండి అభరణాలు, ఇతర వస్తువుల తరలింపును తనిఖీ చేసే సమయంలో వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం కీలకమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలు, అక్రమాలు లేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయి తనిఖీ విధుల్లో ఉన్న ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులకు విధులు, నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. పది లక్షల లోపు, ఆ పైన నగదును తరలిస్తున్నట్లు ఈ బృందాలు గుర్తిస్తే ఆ డబ్బులు ఎన్నికలకు సంబంధించినవా? ఇతర అవసరాలకు సంబంధించినవా? ఎంత మొత్తంలో గుర్తిస్తే ఏ విభాగ అధికారులకు ఆ సమాచారాన్ని తెలియజేయాలనే విషయంపై అవగాహన ఉండాలన్నారు. డబ్బులు, మద్యం ఏమైనా ఇతర వస్తువులను ప్రత్యేకంగా నిల్వ చేసినట్లు గుర్తిస్తే వాటిని సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, డీటీసీ సుశీల, డీటీవో జగన్నాథరావు, ఇన్‌కంట్యాక్స్ జిల్లానోడల్ అధికారి, జీఎస్‌టీ, ఆడిట్ శాఖ అధికారులు ఉన్నారు.

డబ్బు అక్రమ తరలింపును కట్టడి చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, అక్రమంగా డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు మరింత సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల ద్వారా జరిగే లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలు ఏమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని బ్యాంకులను ఈఎస్ఎంఎస్ యాప్‌లో అనుసంధానం చేశామన్నారు. ప్రధాన బ్యాంకు నుంచి శాఖలకు, ఏటీఎంలకు నిధులను తరలిస్తున్నట్లయితే అందుకు సంబంధించిన వివరాలను స్పష్టంగా బాక్స్‌లపైనా ప్రస్తావించడంతో పాటు పూర్తి వివరాను క్యూఆర్ కోడ్ రూపంలో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, ఈఎస్ఎంఎస్ సాంకేతిక పరిశీలకులు భరద్వాజ్ ఉన్నారు.

ప్రచారసామగ్రి ముద్రణలో మార్గదర్శకాలను పాటించాలి

ప్రింటర్లు, అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉన్నందున ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లు, బ్యానర్లు తదితర ప్రచార సామగ్రి ముద్రించే సమయంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లాలోని ప్రింటర్స్ యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తదితర సామగ్రిని ముద్రించే సమయంలో ప్రింటర్స్ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రిప్రజంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ సెక్షన్ 127 ఎ ప్రకారం ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించే సమయంలో తప్పని సరిగా సంబంధించిన ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామాలు లేకుండా కరపత్రాలు, పోస్టర్లను ముద్రించరాదన్నారు. ఏ ప్రింటర్ అయినా నిబంధనలకు అతిక్రమిస్తే ప్రింటింగ్ ప్రెస్ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రింటర్లు ముద్రించే సంస్థలు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అపెండెక్స్-ఎ, అపెండెక్స్-బి ప్రొఫార్మాలో డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించిన తర్వాత మూడు రోజుల్లో ముద్రణకు సంబంధించిన వివరాలను ఎన్నికల విభాగానికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లారెవెన్యూ అధికారి శ్రీలత, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, సెక్రటరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

వాణిజ్య వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు తొలిగించండి

రవాణా శాఖ ఉప కమిషనర్ సుశీల

ఒంగోలుక్రైం, మార్చి18: వాణిజ్య వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు , స్లోగన్లు స్టిక్కర్లు తొలిగించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలా తొలిగించకుండా పట్టుబడితే ఎన్నికలు అయిపోయే వరకు వాహనాలు రిలీజ్ చేయమని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

కంట్రోలు రూం ఏర్పాట్ల పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న కంట్రోలు రూంను సోమవారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. కంట్రోలు రూంతో పాటు సోషల్ మీడియా సెల్, 24/7 కాల్ సెంటర్, ఫిర్యాదుల మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఎన్నికల విభాగాల ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులను అడిగి పలు అంశాలను తెలుసుకున్నారు కలెక్టర్ వెంట స్వీప్ నోడల్ అధికారి రవి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

సీఐ కుమారుడని వదిలేశారు

గ్రూప్-1 పరీక్షలో పోలీసు పిల్లోడి నిర్వాకం
నోటీసులిచ్చి వదిలేసిన వైనం

ఒంగోలుక్రైం,మార్చి 18: గ్రూప్-1 పరీక్షలలో సెల్‌ఫోన్ వినియోగించిన అభ్యర్థికి 41 సీఆర్పీసీ కింద 41 నోటీసులు ఇచ్చి పోలీసులు వదిలేశారు. బేస్తవారిపేటకు చెందిన తేళ్ల చినమల్లయ్య పల్నాడు జిల్లా కారంపూడిలో సీఐగా పనిచేస్తున్నాడు. ఆయనకుమారుడు శివశంకర్ ఆదివారం ఒంగోలు క్విస్ కాలేజీలో జరిగిన గ్రూప్-1 పరీక్షలకు హాజరయ్యాడు. అక్కడ భద్రతా సిబ్బంది కళ్ళుగప్పి సెల్‌ఫోన్ అండర్ వేర్‌లో పెట్టుకొని తీసుకెళ్ళాడు. ప్రశ్నపత్రం ఇచ్చిన తరువాత సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసే ప్రయత్నం చేస్తుండగా అక్కడ ఉన్న సిబ్బంది గుర్తించారు. అదే సమయంలో అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ నిందితుడిని పోలీసులకు అప్పగించాడు. పరీక్ష కేంద్రంలో సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒంగోలు తాలుకా పోలీసులు శివశంకర్‌ను విచారించారు. అయితే సెల్‌ఫోన్ ఓపెన్ చేసేందుకు శివశంకర్ సహకరించలేదు. పోలీసులు తన దైన శైలిలో విచారించి సెల్‌ఫోన్ ఓపెన్ చేసారు. ప్రశ్నపత్రం స్కాన్ చేసి ప్రత్యేకమైన యాప్‌లో చూస్తే ప్రశ్నలకు సమాధానాలు వస్తాయని విచారణలో వెల్లడించినట్లు సమాచారం. దీంతో సెల్‌ఫోన్ సీజ్ చేసి శివశంకర్‌పై మాల్‌ప్రాక్టీస్ క్రింద కేసు నమోదు చేసి 41 సీఆర్పీసీ క్రింద నోటీసులు ఇచ్చారు.

భద్రతా సిబ్బందిపై విమర్శలు

క్విస్ కాలేజీలో గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన భద్రతా సిబ్బందిపై అనేక విమర్శలు వస్తున్నాయి.పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని చెబుతున్న పోలీసు అధికారులు పరీక్ష కేంద్రంలోకి శివశంకర్ సెల్ ఫోన్ తీసుకెళ్ళడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు. సీఐ కుమారుడు ఇలాంటి నిర్వాకానికి పాల్పడటం పట్ల అనేక అనుమానాలు వస్తున్నాయి.దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విచారణ చేశాం- తాలుకా సీఐ

శివశంకర్‌ను విచారించామని ఒంగోలు తాలుకా సీఐ భక్తవత్సల రెడ్డి తెలిపారు.సెల్‌ఫోన్ ఓపెన్ చేసామని, ప్రశ్నపత్రం స్కాన్ చేసి ప్రత్యేకమైన యాప్‌లో పెడితే సమాధానాలు వస్తాయని నిందితుడు విచారణలో తెలిపినట్లు చెప్పారు. సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చెప్పారు.

పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగం

పరీక్ష కేంద్రంలో సెల్ ఫోన్ వినియోగించడం ఐటీ చట్టం కిందకు వస్తుందని ,అయితే మాల్‌ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేయడంపై అనేక విమర్శలు వినబడుతున్నాయి. మాల్‌ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేసి 41 సీఆర్పీసీ కింద నోటీసులు ఇచ్చి ఆదివారం సాయంత్రం శివశకర్‌ను పంపించి వేశారు. గ్రూప్-1 పరీక్ష అత్యంత ప్రతిష్టాత్మకమైనది. ఈ పరీక్షలలో సీఐ కుమారుడు ఇలాంటి చర్యలకు పాల్పడటం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రశ్నపత్రం స్కాన్ చేసి సెల్‌ఫోన్ ద్వారా బయటకు పంపించి సమాధానాలు తెప్పించుకునేందుకు యత్నించి ఉంటాడని ప్రచారం జరుగుతోంది. అయితే దీని వెనుక ఎవరు ఉన్నారు అనే అంశం సీరియస్‌గా తీసుకోక పోవడంలో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


వ్యాను ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన యువకులు

బైక్‌ను ఢీకొన్న వ్యాను

ఇద్దరు యువకులు దుర్మరణం

ఒంగోలుక్రైం, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో మోటార్‌బైక్‌పై వెళుతున్న ఇరువురు యువకులు మృతిచెందారు. ఈ సంఘటన పేర్నమిట్ట సమీపంలో పెట్రోలు బంకు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. పల్సర్ మోటార్‌బైక్‌పై వెళుతున్న సంతనూతలపాడు మండలం ఎండ్లూరుకు చెందిన ఆలూరి సందీప్‌కుమార్ (20), గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన వినయ్‌కుమార్ (20)ను వెనుక నుంచి టమోటా లోడుతో వచ్చిన వ్యాను ఢీకొట్టింది. దీంతో బైక్ డీవైడర్‌ను బలంగా ఢీకొని పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఒంగోలు తాలూకా ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు

టీడీపీలో చేరిన ముస్లింలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : నగరంలోని 3వ డివిజన్ ప్రకాశం కాలనీకి చెందిన పలువురు ముస్లింలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు సోమవారం దామచర్ల నివాసంలో కలిసి టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా దామచర్ల వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ మైనార్టీ నాయకులు షేక్ మీరావలి, షేక్ మహబూబ్ బాషా, షేక్ సుభాని, షేక్ కాలేషా, షేక్ బాజి మరో 25 మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, పఠాన్ అహ్మద్ ఖాన్, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


మృతిచెందిన జగదీష్

మద్దిపాడు, మార్చి 18: మోటర్‌బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు చిత్తూరు జిల్లాకు చెందిన జగదీష్ గత కొన్నేళ్లుగా మద్దిపాడు పరిసర ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్దిపాడు నుంచి ఒంగోలు వెళ్లేక్రమంలో జగదీష్ నడుపుతున్న మోటర్‌బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో జగదీష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మద్దిపాడ ఎస్సై తెలిపారు.

సామాన్యుడిపై సచివాలయ సెక్రటరీ దౌర్జన్యం

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులో ఉండగా సచివాలయంలో వైసీపీ రంగులు, సీఎం జగన్ ఫొటోలు ఎందుకు ఉన్నాయని అడిగిన సామాన్యుడిపై సచివాలయ సెక్రటరీ దురుసుగా ప్రవర్తించారు. సోమవారం పేర్నమిట్ట గ్రామానికి చెందిన మందా శేఖర్ అనే వ్యక్తి 42 డివిజన్‌లోని పేర్నమిట్టలోగల 40,41,42 డివిజన్‌లలో సచివాలయానికి పనిమీద వెళ్ళగా, టేబుళ్ళపై జగన్ ఫొటోలతో కూడిన పత్రాలు, గోడలపై జగన్ ఫొటోలు ఉండటాన్ని శేఖర్ ప్రశ్నించాడు. ఎన్నికల కోడ్ ఉంది కదా అని సెక్రటరీని అడగ్గా, దీంతో ఆగ్రహించిన సచివాలయ శానిటరీ సెక్రటరీ నాగేంద్ర కుమార్ తనపై దురుసుగా ప్రవర్తించాడని శేఖర్ వాపోయారు. నువ్వు ఎవరు ? నీకెందుకు చెప్పాలి ? మా ఇష్టం అంటూ సెక్రటరీ దుడుకుగా ప్రవర్తించాడని, ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, కార్పొరేషన్ కమిషనరును ఆయన కోరారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో. రూ.230

సంతనూతలపాడు, మార్చి 18: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు పేర్నమిట్ట నుంచి 654 పొగాకు బేళ్లు రాగా 574 బేళ్లు అమ్ముడయ్యాయి. 80 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర కేజీ రూ.230లు పలకగా, కనిష్ఠ ధర రూ.220లు, సరాసరి ధర రూ.226.32 వచ్చినట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు వేలంలో 21 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయ నిర్మాణం


కార్యాలయ నిర్మాణ ప్రారంభంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని సోమవారం ప్రారంభించారు. స్థానిక మామిడిపాలెం సర్వే నెంబర్ 73,74,76, 79/123లో, ఐడీఎస్ఎంటీ స్థలాల సమీపంలో చేపట్టిన కార్యాలయ పనులను సమితి కార్యకర్తలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఇప్పటి వరకు కార్యాలయం లేదన్నారు. అయితే కార్యకర్తలందరు సమష్టిగా భవనం నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు త్వరలోనే దీనిని పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి, అధికారపూర్వకంగా ప్రారంభిస్తామని తెలిపారు. పూనూరి నరేష్, పసుమర్తి మరియదాసుతోపాటు మామిడిపాలెం ఎమ్మార్పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్

ఒంగోలు(విద్య), మార్చి 18 : జాతీయ ఉపకార వేతనం నేషనల్ మార్క్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైన విద్యార్థులు తమ బ్యాంకుఖాతాకు తప్పని సరిగా ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఒక ప్రకటనలో కోరారు. 2019, 2020, 2021,2022 సంవత్సరాలలో ఈ స్కాలర్ షిప్‌నకు ఎంపికై ప్రస్తుతం 9నుంచి ఇంటర్మీడియేట్ చదువుతున్న వారు తప్పకుండా తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్‌ను జత చేయించుకోవాలని కోరారు.

మొక్కజొన్న రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : మొక్కజొన్నలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రైతులు మంగళవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. మార్క్‌ఫెడ్ ఏజెన్సీ ద్వారా మొక్కజొన్నలను కనీస మద్దతు ధర క్వింటా రూ. 2,090గా నిర్ణయించారన్నారు. ఈ క్రాప్‌లో మొక్కజొన్న పంటను నమోదు చేసుకున్న రైతులు ఆర్‌బీకేలలో వీఏఏ/వీహెచ్ఏల ద్వారా పంటను అమ్ముకొనేందుకు సీఎంయాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. మొక్కజొన్న రైతులు తమ పేర్లు నమోదు చేసుకొనే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేయాలన్నారు. తద్వారా తమ సరుకును అమ్ముకొనే తేదీ, రిజిస్టర్ మొబైల్ నెంబరుకు మేసేజ్ వస్తుందన్నారు. రైతులు తమ సరుకును అమ్మే సమయంలో తమ మొబైల్ నెంబరు, ఆధార్, బ్యాంకు లింక్ అయిందో లేదో సరిచూసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


టంగుటూరులో పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న పోలీసులు

● పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు ● కేంద్రాలను పరిశీలించిన ఫ్లైయింగ్ స్క్వాడ్, డీఈవో సుభద్ర

సింగరాయకొండ, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాల, మూలగుంటపాడు జడ్పీ హైస్కూల్, భాష్యం హైస్కూల్, గురుకుల పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగుచోట్ల 822 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 799 పరీక్ష రాశారు. 23 మంది గైర్హాజరయ్యారు. సీఐ దాచేపల్లి రంగ్‌నాథ్, ఎస్సై టి.శ్రీరామ్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

టంగుటూరులో 13 మంది గైర్హాజరు

టంగుటూరు : మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరిగాయి. తొలిరోజు 13 మంది గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రానికి 134 మందిని కేటాయించగా 130 మంది హాజరయ్యారు. చైతన్య హైస్కూల్‌లోని కేంద్రానికి 97 మంది విద్యార్థులకు అవకాశం కల్పించగా ఒకరు గైర్హాజరయ్యారు. మర్లపాడు పరీక్షా కేంద్రానికి 227 మందిని అనుమతించగా 219 మంది హాజరయ్యారు. టంగుటూరులోని భాష్యం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 104 మందిని కేటాయించగా అందరూ పరీక్ష రాశారు.

డీఈవో తనిఖీ

మొదటి రోజు తెలుగు పరీక్ష జరిగింది. డీఈవో సుభద్ర స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు.

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18: మార్కాపురంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్‌బీసీ కాలనీ, మున్సిపల్ ఉన్నత పాఠశాల, సాయి బాలాజీ, వివేకానంద, శ్రీ చైతన్య, భాష్యం, నారాయణ పాఠశాలలల్లో, గజ్జలకొండ, రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలు, ఏపీడబ్ల్యూఆర్‌జీఎస్ రాయవరం ఉన్నత పాఠశాల కేంద్రాలుగా మొత్తం 12 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 2207 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 2137 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీలు చేశాయి.

త్రిపురాంతకం, మార్చి 18: పదోతరగతి పరీక్షలు మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. త్రిపురాంతకం జడ్పీ పాఠశాలలో(ఏ) కేంద్రంలో 188 మంది విద్యార్థులకు 176 మంది, బి కేంద్రంలో 128 కి 118 మంది హాజరయ్యారు, గణపవరం గురుకుల పాఠశాలలో 140 కి 139 మంది విద్యార్థులు, దూపాడు బాలికల గురుకుల పాఠశాలలో 143 కి 137 మంది, మేడపి జడ్పీ పాఠశాల కేంద్రంలో 100 మందికి 96 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

18 మంది విద్యార్థుల గైర్హాజరు

పెద్ద దోర్నాల : పదవ తరగతి పరీక్షలకు దోర్నాల మండలంలో 18మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మస్తాన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోర్నాలలో పరీక్షలు రాసేందుకు మూడు కేంద్రాలను కేటాయించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 269 మంది విద్యార్థులకు గానూ 254 మంది, వసంత జూనియర్ కళాశాలలో 250 మందికి 249 మంది రవీంద్ర హైస్కూలులో 154 మందికి 152 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 673 మందికి గానూ 655మంది హాజరయినట్లు తెలిపారు.


సింగరాయకొండలో హాల్‌టిక్కెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థినులు

ఆరుగురు విద్యార్థుల గైర్హాజరు

కంభం : కంభం మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల్లో మొదటి రోజు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. మండలంలో మొత్తం ఏడు సెంటర్లలో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140 మందికి 140 మంది, తురిమెళ్ల హైస్కూలులో 143 మందికి 141 మంది, కంభం బాలికోన్నత పాఠశాలలో 180 మందికి 179 మంది, వాసవి పాఠశాలలో 225 మందికి గాను 223 మంది, సీఎల్ఆర్ కళాశాలలో 160 మందికి 160 మంది, న్యూ ఆల్ఫాలో 180 మందికి 180 మంది, శ్రీచైతన్యలో 160 మందికి 159 మంది హాజరైనట్లు తెలిపారు.

ఐదు సెంటర్లలో పది పరీక్షలు

పొదిలి : పదవతరగతి పరీక్షలు సోమావారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. నిర్మలాకాన్వెంట్‌లో 195 మందికి 193 మంది, ఆల్ఫాస్కూల్ 200లకు 199, జూనియర్ కాలేజ్‌లో 209కి 201, బాలుర ఉన్నత పాఠశాల157కు 154, బాలికల ఉన్నత పాఠశాలల్లో 187కు 168 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఆయా పాఠశాలల ఛీఫ్‌లు తెలిపారు.

తొలిరోజు 59 మంది విద్యార్థులు గైర్హాజరు

గిద్దలూరు టౌన్ : పట్టణంలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 7 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా 1313 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. వీరిలో 59 మంది విద్యార్థులు గైరుహాజరయ్యారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ పాల్స్ నందు 2 కేంద్రాలు, సూర్య విద్యానికేతన్, ముండ్లపాడులోని గంజివీరయ్య మెమోరియల్ స్కూల్ నందు పరీక్ష కేంద్రాలలో నిర్వహించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా అధికారులు వసతులు కల్పించారు.





మార్కాపురంలో పరీక్షకు హాజరవుతున్న, తిరిగి వస్తున్న విద్యార్థులు, త్రిపురాంతకంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, పొదిలిలో పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థినులు

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్టీలు

మార్కాపురం రూరల్, మార్చి 18: నకిలీ కులధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు ఎస్టీలు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాకు అందజేశారు. త్రిపురాంతకం పట్టణంలోని బ్రహ్మంగారి కాలనీకి చెందిన కొందరు నకిలీ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలను సృష్టించి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందు తున్నారని ఆ కాలనీ ఎస్టీ కులానికి చెందిన వ్యక్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోతి నాగరాజు అనే వ్యక్తి జూపాడు బంగ్లా వెలుగోడు గ్రామం నుంచి 25 సంవత్సరాల క్రితం 100 కుటుంబాలను తీసుకొచ్చి నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను సృష్టించాడన్నారు. అప్పటి నుంచి ప్రభుత్వ భూములను, రాయితీలను పొందుతున్నారన్నారు. వారు నిజంగా ఎస్టీ కులస్థులైన తమకు వారు నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం వలన అన్యాయం జరుగుతుందన్నారు. ఆటువంటి వారిపై అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఏ.శ్రీనివాసరావు, ఎం.తిరుపతి రావు, ఎ.నాభూషి, కాలనీవాసులు పాల్గొన్నారు.

డీఈ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మార్కాపురం రూరల్, మార్చి 18: విద్యుత్‌శాఖ ఉద్యోగుల పట్ల డీఈ నాగేశ్వరరావు తీరును వ్యతిరేకిస్తూ, సోమవారం పట్టణంలోని ఆ శాఖ కార్యాలయం వద్ద ఏపీఈఈ యూనియన్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించిన విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ డీఈ నాగేశ్వరరావు శాఖలో లంచం కొట్టు ఆర్డర్ పట్టు అనే స్కీములను వెంటనే ఆపాలని కోరారు. లైన్‌మెన్‌లో ట్రాన్స్‌ఫర్‌లలో ఇటిలైజేషన్ విధానం ఉపయోగించి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. గిద్దలూరు, అన్నంపల్లి ఎస్ఎస్ పోస్టులను అమ్ముకున్నాడని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలలో శాఖపరమైన నిబంధనలు పాటించకుండా తాను ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పరు -బైక్ ఢీ, ముగ్గురికి తీవ్రగాయాలు

పొదిలి, మార్చి 18 : టిప్పరు-మోటార్ బైక్ ఢీకొని ముగ్గురి కి తీవ్రగాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని తళమల్ల గ్రామ పంచాయతీలోని ఫిర్‌దౌస్ నగర్ కాలనీ వాసులు మోటార్ బైక్‌పై పొదిలి వైపుకు వస్తున్నారు. అదే సమయంలో పొదిలి వైపునకు వస్తున్న టిప్పరు ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. అయితే టిప్పర్ ఆపకుండా వెళ్లిపోయిందని వారు తెలిపారు. ఈ ప్రమాదంలో ఫిర్‌దౌసనగర్‌కు చెందిన షేక్ బాబాసాహేబ్, మస్తాన్‌వలి, నయాబ్‌రసూల్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

టీడీపీలో చేరనున్న రవిబాబు

టంగుటూరు, మార్చి 18 : వైసీపీకి రాజీనామా చేసిన ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, మండలంలోని వాసేపల్లిపాడుకి చెందిన లింగంగుంట రవిబాబు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయన త్వరలో సైకిలెక్కనున్నారు. తనతోపాటు మరికొంత మంది డైరెక్టర్లు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు రవిబాబు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన ఎస్సీలకు సంబంధించిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. దళితులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటామని ఆయన ప్రకటించారన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేస్తానని ఆయన జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారని రవిబాబు వివరించారు. ఈనేపథ్యంలో తాను టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

డీప్ బోరు తొలగింపు

● ఓబులాపురం తాండాలో మొదటికొచ్చిన తాగునీటి సమస్య


బోరు తొలగిస్తున్న అధికారులు

గిద్దలూరు, మార్చి 18 : మండలంలోని ఓబులాపురం తాండా సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో నీటి కోసం ఏర్పాటు చేసిన డీప్‌బోరును అటవీశాఖ అధికారులు తొలగిం చారు. ఓబులాపురం తాండాలో భూగర్భజలాలు అడుగంటాయి. ఇటీవల కాలంలో ఐదు ప్రాంతా ల్లో డీప్‌బోరు వేసినప్పటికీ చుక్కనీరు కూడా పడలేదు. దీంతో గ్రామస్తులే చందాలు వేసుకొని తాండాకు సమీపంలోని ఒక ప్రాంతాల్లో నీరు పడతాయన్న ఆశతో నాలుగు రోజులక్రితం బోరు వేసుకున్నారు. నీరు పుష్కలంగా పడింది. ఇక నీటిసమస్య పరిష్కారం అవుతుందని భావించారు. అయితే బోరు వేసిన ప్రాంతం అటవీభూమి అని అధికారులు సోమవారం డీప్‌బోరును, అందులోని పైపులను తొలగించారు. అటవీ ప్రాంతంలో బోరు వేయడం కుదరదని పేర్కొన్నారు. అధికారుల నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవాలని సిబ్బంది పేర్కొంటుండగా తాగునీటి కోసం వేసిన బోరును తొలగించడం శోచనీయమని, భూగర్భజలాలు పెరిగే వరకైనా ఈ బోరు నుంచి నీటిని వినియోగించుకొనే ఏర్పాట్లు చేయాలని తాండావాసులు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కీర్తి పురస్కారం

గిద్దలూరు, మార్చి 18 : గిద్దలూరు ఎల్ఐసీ కార్యాలయంలో ఏజెంగా పని చేస్తున్న రచయిత్రి నామాని సుజనదేవికి ఉత్తమ రచయిత్రి విభాగంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 21న సుజనదేవికి హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పురస్కారాన్ని అందజేయనున్నారు. కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు మొద లైన సాహిత్య ప్రక్రియలలో తాను చేసిన సాహిత్య కృషిని పరిగణలోకి తీసుకుని తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించడం తనకు గర్వకారణంగా ఉందని, ఇది తనపైన సమాజం పట్ల ఉన్న బాధ్యతను మరింతగా పెంచిందని సుజనదేవి ఈసందర్భంగా పేర్కొన్నారు.

రమణీయం లక్ష్మీనారాయణ రథోత్సవం


దేవేరులతో లక్ష్మీనారాయణుడు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెల సిన ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా, కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమ వారం రాత్రి లక్ష్మీనారాయణ రథోత్సవం రమణీయంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవాన్ని తిలకించారు. యువత రథం లాగేందు కు పోటీ పడ్డారు. ఆల య కమిటీ అధ్యక్షుడు డీవీ కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పకడ్బందీగా ఎన్నికల నిబంధనలు అమలు

కొండపి, మార్చి 18 : ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు అన్ని గ్రామాల్లో తొలగించడం జరిగిందన్నారు. సచివాలయాలపై ఉన్న సీఎం బొమ్మలపై పేపర్‌లు అంటించామన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు పూర్తిగా ముసుగులు వేశామని చెప్పారు. ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, కటౌట్‌లపై వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వీటి ఖర్చును అభ్యర్థుల ఖర్చు కింద లెక్కించడం జరుగుతుందని ఈఆర్వో వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పార్టీలు, అభ్యర్థులు విధిగా పాటించాలన్నారు.

కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు ప్రతిరోజూ 24 గంటలు పనిచేసేవిధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దీన్ని ఈఆర్వో కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి సిబ్బంది 24 గంటలూ పనిచేస్తారని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూంకు సెల్ నంబరు 9032319379, ల్యాండ్ నంబరు 08598294717 కేటాయించినట్లు చెప్పారు. ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని, సాయాన్ని ఇక్కడ నుంచి పొందవచ్చన్నారు. వారు ఏదైనా సమాచారాన్ని ఈ కేంద్రానికి తెలియజేయవచ్చన్నారు. అనంతరం ఆయన తహసీల్దార్‌లతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బి.కిరణ్‌కుమార్, భవానీప్రాద్, చక్రవర్తి, సుధాకర్, కుటుంబరావు, సుందరమ్మ ఎలక్షన్ డీటీ నాగరాజు, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ హనుమంతరావు, కొండపి తహసీల్దార్ కార్యాలయ డీటీ సుజాత పాల్గొన్నారు.


కంట్రోల్ రూంను ప్రారంభించి మాట్లాడుతున్న తహసీల్దార్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 18 : టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కా ర్యాలయంలో బేస్తవారపేట మండలం జేసీ. అగ్రహారం గ్రామ మాజీ సర్పంచ్ బత్తుల గంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో జేసీ. అగ్రహారం, మల్లాపురం గ్రామాలకు చెందిన 250 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని, మనందరం పార్టీని గెలిపించుకుందామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే కుటుంబ భద్రతతోపాటు ఆర్థిక భద్రత ఉంటుందన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అభివృద్ధి బాటలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాగుంట పరిశీలకులు శైలేష్‌కుమార్‌రెడ్డి, బేస్తవారపేట మండలపార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు పూనూరి భూపాల్‌రెడ్డి, పూనేరి జగన్‌మోహన్‌రెడ్డి, మేడం భాస్కర్‌రెడ్డి, పందిళ్ళపల్లి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.


వైసీపీని వీడి టీడీపీలో చేరిన జేసీ అగ్రహారం గ్రామస్థులు

కోడ్ వచ్చినా తొలగని రంగులు

త్రిపురాంతకం, మార్చి 18: ఎన్నికల కోడ్ వచ్చి రెండు రోజులు పూర్తయినా అధికారులు మాత్రం కోడ్ అమలుకు ససేమిరా అంటున్నారు. మండలంలోని కొన్నిగ్రామాల్లో వైసీపీ రంగులతో జెండా దిమ్మెలు, శిలాఫలకాలపై ముఖ్యమంత్రి జగన్, మంత్రి సురేష్ ఫోటోలు, ప్రచార వాల్ పోస్టర్లు కనిపిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీవేపల్లిలో మంచినీటి ట్యాంకుకు వైసీపీ రంగులు వేశారు. వెల్లంపల్లిలో వైసీపీ ప్రచార వాల్‌పోస్టర్లు ఉన్నా తొలగించలేదు. సొసైటీ భవనానికి వైసీపీ రంగులతో పెద్దపెద్ద అక్షరాలతో పేర్లు రాశారు. అయినా తొలగించాల్సి న అధికారులు అటువైపు చూడలేదు. దూపాడు లో జగనన్న కాలనీ శిలా ఫలకంపై జగన్, సురేష్ ఫోటోలతోపాలు వైసీపీ రంగులను తొలగించ కుండా అలానే వదిలేశారు. ఇక వెల్లంపల్లిలో ఇటీవల నిర్మించిన గ్రామ సచివాలయంపై నవరత్నాల లోగోతో జగన్ ఫోటో, శిలాఫలకంపై జగన్, సురేష్ ఫోటోలు, ఎదురుగా జెండా దిమ్మెకు వైసీపీ రంగులు అలానే ఉన్నాయి. గణపవరంలో పలు చోట్ల వైసీపీ జెండాలు ఎగురుతున్నాయి. కాగా ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయకపోవడంతో అధికారులపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



గొల్లపల్లిలో దిమ్మెకు రంగులు


దీవేపల్లిలో మంచినీటి ట్యాంకుకు వేసిన వైసీపీ రంగు

ఓపెన్ ఇంటర్ పరీక్షలో మాస్ కాపీయింగ్

కంభం, మార్చి 18 : కంభం మండలంలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావిపాడు జడ్‌పి హైస్కూలు లో జరుగుతున్న ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోంది. దీనిపై సంబంధిత అధికారు లు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ విద్యార్థులు 216 మంది, రావిపాడు జడ్‌పి హైస్కూలులో 218 మంది పరీక్షలు రాస్తున్నారు. అయితే ఆయా సెంటర్లలో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఈ విషయ మై ఆయా పరీక్షల చీఫ్‌లు విక్టర్, చంద్రశేఖర్‌రెడ్డిలను వివరణ కోరగా తాము కాపీలకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


కేంద్రంలోని వెళుతున్న అపరిచిత వ్యక్తి

బాలికల ఆచూకీ లభ్యం

● నిందితులు అరెస్టు

గిద్దలూరు, మార్చి 18 : మైనర్ బాలికల అదృశ్యం, మిస్టరీ వీడింది. మాయమాటలు చెప్పి బాలికలను తీసుకువెళ్లిన నిందితులు కటకటాల పాలయ్యారు. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు సోమవారం సాయంత్రం రాచర్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. రాచర్లఫారానికి చెందిన ఇద్దరు బాలికలు జనవరి 27వ తేదీన పాఠశాలకు వెళ్లి వస్తామని ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రానికి కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి అదృశ్యంపై వారి తల్లిదండ్రులు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుండి పోలీసులు వారి ఆచూకీ కోసం గాలిస్తూనే ఉన్నారు. వీరికి అదే గ్రామానికి చెందిన దూదేకుల వంశి, ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న జిల్లెల ఖాశింపీరాలు వీరికి మాయమాటలు చెప్పి వీరిరువురిని తీసుకుని విజయవాడ, నందిగామ, గుడివాడ, తదితర ప్రాంతాలలో ఇప్పటివరకు తలదాచుకున్నట్లు డీఎస్పీ బాలసుందర్‌రావు తెలిపారు. వీరందరూ సోమవారం గిద్దలూరు వచ్చి కృష్ణథియేటర్ సమీపంలో ఉండగా సమాచారం మేరకు అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. బాలికలు ఇరువురిని వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. నిందితులిరువురిని అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

కలగానే ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం

- గ్రామాల్లో తాగునీటి తప్పని ఇక్కట్లు
- భూగర్భ జలాల సమస్య యథాతథం
- అమలుకాని మంత్రి హామీ


చెరువును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్ ఫోటో)

త్రిపురాంతకం, మార్చి 18: మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్యను దూరం చేసేందుకు ప్రతిపాదించిన త్రిపురాంతకం చెరువులో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం కలగానే మిగిలిపోయింది. దీని కోసం ప్రజలు ఏళ్లగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని లేళ్లపల్లి, దువ్వలి, మిట్టపాలెం, రామసముద్రం, టి.చెర్లోపల్లి గ్రామాలతో పాటు త్రిపురాంతకం పట్టణానికి, ఎర్రగొండపాలెం మండలం రామచంద్రాపురం, అయ్యంబొట్లపల్లి గ్రామాలకు తాగునీటిని అందించేందుకు త్రిపురాంతకం చెరువులో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం చేయాలని గత టీడీపీ హయాంలో ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు చొరవతో 2017 జూన్ నెలలో జిల్లా ఆర్‌డబ్ల్యుయస్ ఎస్‌ఈ సంజీవరెడ్డి, ఈఈ మల్లికార్జునరావు, నాయకులు త్రిపురాంతకం చెరువును పలుమార్లు పరిశీలించారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయానికి పడమర వైపున చెరువులో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించేందుకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దానికి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక, ప్రతిపాదనలు తయారు చేసి రూ.16.9 కోట్ల ఖర్చు అవుతుందని అంచనాలు తయారుచేసి ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులకు పంపారు. దీంతో అప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించడమే తరువాయి అని చెప్పారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతిపాదనలు, ఆలోచనలు పక్కన పెట్టడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కాగా ఆయా గ్రామాలలో వేసవిలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటి తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏటా తాత్కాలికంగా సమస్యను తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇలా ట్యాంకర్లతో నీటి సరఫరాకు లక్షల్లో ఖర్చు అవు తుంది. కాగా 2019 ఎన్నికల ప్రచారంలో ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలోనూ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చింది. దీంతో సమస్య పరిష్కారమవుతుందని ఎదురు చూసిన ప్రజలకు మాత్రం మంత్రి సురేష్ ఏమీ చేయకపోగా టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించిన ఎస్‌ఎస్ ట్యాంకును కూడా నిర్మించేందుకు సహకరించలేదనే విమర్శలు వచ్చాయి. దీంతో ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచి... మంత్రిగా ఐదేళ్ల పనిచేసినా తాగునీటి సమస్య పరిష్కారానికి మాత్రం ఏమీచేయలేకపోయాడనే అప్రతిష్టనే మూటగట్టుకున్నారు.


త్రిపురాంతకం చెరువు

అవీ..ఇవీ..

గ్రామాల్లో సమస్యలు సృష్టించవద్దు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదిలి, మార్చి 18 : ఎన్నికలకోడ్ అమలులో ఉందని గ్రామాల్లో సమస్య సృష్టించే పనులు, కార్యక్రమాలు చేయవద్దని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని పోతవరం గ్రామంలో నగర పంచాయతీ కమిషనర్, తహసీల్దార్ జియా, ఎస్ఐ కోటయ్యల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి అరాచక ఘటనలు జరుగకుండా ఎన్నికలు నిర్వహించడమే ఎన్నికల కమిషన్ ముఖ్య ఉద్దేశ్య మన్నారు. అందుకు ప్రజలు తమవంతు సహకరించాలని కోరారు. గ్రామంలో ఏ పార్టీ నాయకుడు, కార్యకర్తలు ప్రజలను భయానికి గురిచేసినట్లు తెలిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్ లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల విషయంలో ఎవరైనా భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే ఆబాధ్యత గ్రూప్ అడ్మిన్‌దేనని అన్నారు. కనుక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎన్నికలు జరిగే విధంగా చూడాలని ప్రజలను కోరారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలో మాస్ కాపీయింగ్


పరీక్షహాల్‌లోకి వెళుతున్న అనుమానాస్పద వ్యక్తి

కంభం, మార్చి 18 : కంభం మండలంలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావిపాడు జడ్‌పి హైస్కూలులో జరుగుతున్న ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోంది. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ విద్యార్థులు 216 మంది, రావిపాడు జడ్‌పి హైస్కూలులో 218 మంది పరీక్షలు రాస్తున్నారు. అయితే ఆయా సెంటర్లలో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఈ విషయ మై ఆయా పరీక్షల చీఫ్‌లు విక్టర్, చంద్రశేఖర్‌రెడ్డిలను వివరణ కోరగా తాము కాపీలకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రమణీయం లక్ష్మీనారాయణ రథోత్సవం


దేవేరులతో లక్ష్మీనారాయణుడు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్స వాలు వైభవంగా, కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి లక్ష్మీనారా యణ రథోత్సవం రమణీయంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవాన్ని తిలకించారు. యువత రథం లాగేందుకు పోటీ పడ్డారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీ కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మైనర్ బాలికల ఆచూకీ లభ్యం

- నిందితులు అరెస్టు

గిద్దలూరు, మార్చి 18 : మైనర్ బాలికల అదృశ్యం, మిస్టరీ వీడింది. మాయమాటలు చెప్పి బాలికలను తీసుకువెళ్లిన నిందితులు కటకటాల పాలయ్యారు. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు సోమవారం సాయంత్రం రాచర్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. రాచర్లఫారానికి చెందిన ఇద్దరు బాలికలు జనవరి 27వ తేదీన పాఠశాలకు వెళ్లి వస్తామని ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రానికి కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి అదృశ్యంపై వారి తల్లిదండ్రులు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుండి పోలీసులు వారి ఆచూకీ కోసం గాలిస్తూనే ఉన్నారు. వీరిలో ఒక మైనర్ బాలిక 8వ తరగతి చదువుతుండగా మరో మైనర్ బాలిక 9వ తరగతి చదువుతోంది. వీరిరువురు రాచర్ల ఫారం నుంచి నిత్యం రాచర్లలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూళ్లకు వెళ్లి ఇంటికి వచ్చేవారు. వీరికి అదే గ్రామానికి చెందిన దూదేకుల వంశీ, ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న జిల్లెల ఖాశింపీరాలు వీరికి మాయమాటలు చెప్పి వీరిరువురిని తీసుకుని విజయవాడ, నందిగామ, గుడివాడ, తదితర ప్రాంతాలలో ఇప్పటివరకు తలదాచుకున్నట్లు డీఎస్పీ బాలసుందర్‌రావు తెలిపారు. వీరందరూ సోమవారం గిద్దలూరు వచ్చి కృష్ణథియేటర్ సమీపంలో ఉండగా సమాచారం మేరకు అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. బాలికలు ఇరువురిని వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. నిందితులిరువురిని అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ దాసరి ప్రసాద్, ఎస్సై హరిబాబు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్టీలు

మార్కాపురం రూరల్, మార్చి 18: నకిలీ కులధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు ఎస్టీలు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాకు అందజేశారు. త్రిపురాంతకం పట్టణంలోని బ్రహ్మంగారి కాలనీకి చెందిన కొందరు నకిలీ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలను సృష్టించి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందు తున్నారని ఆ కాలనీ ఎస్టీ కులానికి చెందిన వ్యక్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోతి నాగరాజు అనే వ్యక్తి జూపాడు బంగ్లా వెలుగోడు గ్రామం నుంచి 25 సంవత్సరాల క్రితం 100 కుటుంబాలను తీసుకొచ్చి నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను సృష్టించాడన్నారు. అప్పటి నుంచి ప్రభుత్వ భూములను, రాయితీలను పొందుతున్నారన్నారు. వారు నిజంగా ఎస్టీ కులస్థులైన తమకు వారు నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం వలన అన్యాయం జరుగుతుందన్నారు. అటువంటి వారిపై అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఏ.శ్రీనివాసరావు, ఎం.తిరుపతిరావు, ఎ.నాభూషి, కాలనీవాసులు పాల్గొన్నారు.

డీఈ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మార్కాపురం రూరల్, మార్చి 18: విద్యుత్‌శాఖ ఉద్యోగుల పట్ల డీఈ నాగేశ్వరరావు తీరును వ్యతిరేకిస్తూ, సోమవారం పట్టణంలోని ఆ శాఖ కార్యాలయం వద్ద ఏపీఈఈ యూనియన్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించిన విద్యుత్ ఉద్యోగులు మాట్లాడుతూ డీఈ నాగేశ్వరరావు శాఖలో లంచం కొట్టు ఆర్డర్ పట్టు అనే స్కీములను వెంటనే ఆపాలని కోరారు. లైన్‌మెన్‌లో ట్రాన్స్‌ఫర్‌లలో ఇటిలైజేషన్ విధానం ఉపయోగించి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. గిద్దలూరు, అన్నంపల్లి ఎస్‌ఎస్ పోస్టులను అమ్ముకున్నాడని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలలో శాఖపరమైన నిబంధనలు పాటించకుండా తాను ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పరు-బైక్ ఢీ, ముగ్గురికి తీవ్రగాయాలు


చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

పొదిలి, మార్చి 18 : టిప్పరు-మోటార్ బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని తళమల్ల గ్రామ పంచాయతీలోని ఫిర్‌దౌస్ నగర్ కాలనీ వాసులు మోటార్ బైక్‌పై పొదిలి వైపుకు వస్తున్నారు. అదే సమయంలో పొదిలి వైపునకు వస్తున్న టిప్పరు ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. అయితే టిప్పర్ ఆపకుండా వెళ్లిపోయిందని వారు తెలిపారు. ఈ ప్రమాదంలో ఫిర్‌దౌస్‌నగర్‌కు చెందిన షేక్ బాబాసాహేబ్, మస్తాన్‌వలి, నయాబ్‌రసూల్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి


వైసీపీని వీడి టీడీపీలో చేరిన జేసీ అగ్రహారం గ్రామస్థులు


గిద్దలూరు టౌన్, మార్చి 18 : టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బేస్తవారపేట మండలం జేసీ. అగ్రహారం గ్రామ మాజీ సర్పంచ్ బత్తుల గంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో జేసీ. అగ్రహారం, మల్లాపురం గ్రామాలకు చెందిన 250 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని, మనందరం పార్టీని గెలిపించుకుందామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే కుటుంబ భద్రతతోపాటు ఆర్థిక భద్రత ఉంటుందన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అభివృద్ధి బాటలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాగుంట పరిశీలకులు శైలేష్‌కుమార్‌రెడ్డి, బేస్తవారపేట మండలపార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు పూనూరి భూపాల్‌రెడ్డి, పూనేరి జగన్‌మోహన్‌రెడ్డి, మేడం భాస్కర్‌రెడ్డి, పందిళ్ళపల్లి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

కోడ్ వచ్చినా తొలగని రంగులు

త్రిపురాంతకం, మార్చి 18: ఎన్నికల కోడ్ వచ్చి రెండు రోజులు పూర్తయినా అధికారులు మాత్రం కోడ్ అమలుకు ససేమిరా అంటున్నారు. మండలంలోని కొన్నిగ్రామాల్లో వైసీపీ రంగులతో జెండా దిమ్మెలు, శిలాఫలకాలపై ముఖ్యమంత్రి జగన్, మంత్రి సురేష్ ఫోటోలు, ప్రచార వాల్ పోస్టర్లు కనిపిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీవేపల్లిలో మంచినీటి ట్యాంకుకు వైసీపీ రంగులు వేశారు. వెల్లంపల్లిలో వైసీపీ ప్రచార వాల్‌పోస్టర్లు ఉన్నా తొలగించలేదు. సొసైటీ భవనానికి వైసీపీ రంగులతో పెద్దపెద్ద అక్షరాలతో పేర్లు రాశారు. అయినా తొలగించాల్సి న అధికారులు ఆటువైపు చూడలేదు. దూపాడు లో జగనన్న కాలనీ శిలాఫలకంపై జగన్, సురేష్ ఫోటోలతోపాలు వైసీపీ రంగులను తొలగించకుండా అలానే వదిలేశారు. ఇక వెల్లంపల్లిలో ఇటీవల నిర్మించిన గ్రామ సచివాలయంపై నవరత్నాల లోగోతో జగన్ ఫోటో, శిలాఫలకంపై జగన్, సురేష్ ఫోటోలు, ఎదురుగా జెండా దిమ్మెకు వైసీపీ రంగులు అలానే ఉన్నాయి. గణపవరంలో పలు చోట్ల వైసీపీ జెండాలు ఎగురుతున్నాయి. కాగా ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు ఆ దిశగా కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.



గొల్లపల్లిలో దిమ్మెకు రంగులు


దీవేపల్లిలో మంచినీటి ట్యాంకుకు వేసిన వైసీపీ రంగు

అటవీ భూమిలోని డీప్ బోరు తొలగింపు

- ఓబులాపురం తాండాలో మొదటికొచ్చిన తాగునీటి సమస్య


బోరు తొలగిస్తున్న అధికారులు

గిద్దలూరు, మార్చి 18 : మండలంలోని ఓబులాపురం తాండా సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలో నీటి కోసం ఏర్పాటు చేసిన డీప్‌బోరును అటవీశాఖ అధికారులు తొలగించారు. ఓబులాపురం తాండాలో భూగర్భజలాలు అడుగంటాయి. ఇటీవల కాలంలో ఐదు ప్రాంతాల్లో డీప్‌బోరు వేసినప్పటికీ చుక్కనీరు కూడా పడలేదు. దీంతో గ్రామస్తులే చందాలు వేసుకొని తాండాకు సమీపంలోని ఒక ప్రాంతాల్లో నీరు పడతాయన్న ఆశతో నాలుగు రోజులక్రితం బోరు వేసుకున్నారు. నీరు పుష్కలంగా పడింది. ఇక నీటిసమస్య పరిష్కారం అవుతుందని భావించారు. అయితే బోరు వేసిన ప్రాంతం అటవీభూమి అని అధికారులు సోమవారం డీప్‌బోరును, అందులోని పైపులను తొలగించారు. అటవీ ప్రాంతంలో బోరు వేయడం కుదరదని పేర్కొన్నారు. అధికారుల నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవాలని సిబ్బంది పేర్కొంటుండగా తాగునీటి కోసం వేసిన బోరును తొలగించడం శోచనీయమని, భూగర్భజలాలు పెరిగే వరకైనా ఈ బోరు నుంచి నీటిని వినియోగించుకొనే ఏర్పాట్లు చేయాలని తాండావాసులు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కీర్తి పురస్కారం

గిద్దలూరు, మార్చి 18 : గిద్దలూరు ఎల్‌ఐసీ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న రచయిత్రి నామాని సుజనదేవికి ఉత్తమ రచయిత్రి విభాగంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 21న సుజనదేవికి హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పురస్కారాన్ని అందజేయనున్నారు. కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు మొదలైన సాహిత్య ప్రక్రియలలో తాను చేసిన సాహిత్య కృషిని పరిగణలోకి తీసుకుని తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురష్కారాన్ని ప్రకటించడం తనకు గర్వకారణంగా ఉందని, ఇది తనపైన సమాజం పట్ల ఉన్న బాధ్యతను మరింతగా పెంచిందని సుజనదేవి ఈసందర్భంగా పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి గాయాలు

- ఫ్లెక్సీలను తొలగిస్తుండగా ఘటన


గాయపడ్డ భాస్కర్

గిద్దలూరు టౌన్, మార్చి 18 : ఫ్లెక్సీ బోర్డులను తొలగిస్తూ పారిశుధ్య కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురైన ఘటన సోమవారం మధ్యాహ్నం పట్టణంలో చోటు చేసుకొంది. అందిన సమాచారం నగర పంచాయతీలో తాత్కాలిక పారిశుధ్య కార్మికుని గా విధులు నిర్వహిస్తున్న కొమ్మునూరి భాస్కర్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మున్సిపల్ అధికారులు ఆదేశాలతో ఫ్లెక్సీ బోర్డులను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో భాస్కర్ హెచ్‌పి పెట్రోల్‌బంకు సమీపంలో ఫ్లెక్సీ బోర్డులను తొలగిస్తున్న సమయంలో అక్కడే ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. భాస్కర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. గాయపడ్డ భాస్కర్‌ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరామర్శించి కుటుంబాన్ని ఇబ్బందులు లేకుండా ఆదుకుంటామన్నారు. భాస్కర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు ఆవులయ్య, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జి.నాగయ్య, ఎం.మురళి డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- కేంద్రాలను పరిశీలించిన ఫ్లైయింగ్ స్క్వాడ్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18: మార్కాపురంలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్‌సీబీసీ కాలనీ, మున్సిపల్ ఉన్నత పాఠశాల, సాయి బాలాజీ, వివేకానంద, శ్రీ చైతన్య, భాష్యం, నారాయణ పాఠశాలల్లో, గజ్జలకొండ, రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలు, ఏపీడబ్ల్యూఆర్‌జీఎస్ రాయవరం ఉన్నత పాఠశాల కేంద్రాలుగా మొత్తం 12 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. 2207 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 2137 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీలు చేశాయి.

త్రిపురాంతకం, మార్చి 18: పదోతరగతి పరీక్షలు మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. త్రిపురాంతకం జడ్పీ పాఠశాలలో(ఏ) కేంద్రంలో 188 మంది విద్యార్థులకు 176 మంది, బి కేంద్రంలో 128 కి 118 మంది హాజరయ్యారు, గణపవరం గురుకుల పాఠశాలలో 140 కి 139 మంది విద్యార్థులు, దూపాడు బాలికల గురుకుల పాఠశాలలో 143 కి 137 మంది, మేడపి జడ్పీ పాఠశాల కేంద్రంలో 100 మందికి 96 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

18 మంది విద్యార్థుల గైర్హాజరు

పెద్ద దోర్నాల : పదవ తరగతి పరీక్షలకు దోర్నాల మండలంలో 18మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మస్తాన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోర్నాలలో పరీక్షలు రాసేందుకు మూడు కేంద్రాలను కేటాయించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 269 మంది విద్యార్థులకు గానూ 254 మంది, వసంత జూనియర్ కళాశాలలో 250 మందికి 249 మంది రవీంద్ర హైస్కూలులో 154 మందికి 152 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 673 మందికి గానూ 655మంది హాజరయినట్లు తెలిపారు.

ఆరుగురు విద్యార్థుల గైర్హాజరు

కంభం : కంభం మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల్లో మొదటి రోజు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. మండలంలో మొత్తం ఏడు సెంటర్లలో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140 మందికి 140 మంది, తురిమెళ్ల హైస్కూలులో 143 మందికి 141 మంది, కంభం బాలికోన్నత పాఠశాలలో 180 మందికి 179 మంది, వాసవి పాఠశాలలో 225 మందికి గాను 223 మంది, సీఎల్‌ఆర్ కళాశాలలో 160 మందికి 160 మంది, న్యూ ఆల్ఫాలో 180 మందికి 180 మంది, శ్రీచైతన్యలో 160 మందికి 159 మంది హాజరైనట్లు తెలిపారు.

ఐదు సెంటర్లలో పది పరీక్షలు

పొదిలి : పదవతరగతి పరీక్షలు సోమావారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. నిర్మలాకాన్వెంట్‌లో 195 మందికి 193 మంది, ఆల్ఫాస్కూల్ 200లకు 199, జూనియర్ కాలేజ్‌లో 209కి 201, బాలుర ఉన్నత పాఠశాల157కు 154, బాలికల ఉన్నత పాఠశాలల్లో 187కు 168 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఆయా పాఠశాలల చీఫ్‌లు తెలిపారు.


పొదిలిలో పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థినులు

తొలిరోజు 59 మంది విద్యార్థులు గైర్హాజరు

గిద్దలూరు టౌన్ : పట్టణంలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 7 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా 1313 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. వీరిలో 59 మంది విద్యార్థులు గైరుహాజరయ్యారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ పాల్స్ నందు 2 కేంద్రాలు, సూర్య విద్యానికేతన్, ముండ్లపాడులోని గంజీవీరయ్య మెమోరియల్ స్కూల్ నందు పరీక్ష కేంద్రాలలో నిర్వహించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలుగకుండా అధికారులు వసతులు కల్పించారు.




మార్కాపురంలో పరీక్షకు హాజరవుతున్న, తిరిగి వస్తున్న విద్యార్థులు, త్రిపురాంతకంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఈఆర్ఓ లోకేశ్వరరావు

దర్శి, మార్చి 18 : ఎన్నికలు నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని నియోజకవర్గ ఈఆర్వో ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున అన్నీ మండలాల్లో నిబంధనలకు అనుగుణంగా కోడ్ తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ఎక్కడైనా కోడ్ ఉల్లంఘన జరిగితే అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పామూరు జేజేసీ ప్రిన్సిపాల్‌గా రాజశేఖర్



ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

పామూరు, మార్చి 18 : పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కే రాజశేఖర్ నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సింగరాయకొండ కాలేజీలో పనిచేస్తున్న ఆయన బదిలీపై పామూరుకు వచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు జి. రమణయ్య, జె. సురేష్, నూతన ప్రిన్సిపాల్ రాజశేఖర్‌ను శాలువతో సత్కరించారు.


ముండ్లమూరు ఎస్ఐగా ఆంజనేయులు



ఎస్ఐ ఆంజనేయులు

ముండ్లమూరు, మార్చి 18 : స్థానిక పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా వి.ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ముండ్లమూరు వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన వై.నాగరాజుకు సీఐగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు.

ట్రాన్స్‌కో ఏఈగా వీరబ్రహ్మం



ఏఈ వీరబ్రహ్మం

ముండ్లమూరు, మార్చి 18 : ముండ్లమూరు మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎస్.వీరబ్రహ్మం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తాళ్లూరు మండల ఏఈగా పనిచేస్తూ బదిలీపై ముండ్లమూరుకు వచ్చారు. ఇప్పటి వరకు ఏఈగా పని చేసిన జె.భూరాజు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు.

అన్ని బూత్‌లలో టీడీపీకి ఆధిక్యత చేకూర్చాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి, మార్చి 18 : వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అన్నీ బూత్‌లలో ఆధిక్యత లభించేలా బూత్ కన్వీనర్లు కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పాపారావులు సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా విభాగం అధికార ప్రతినిధి శోభారాణి, కురిచేడు మండల టీడీపీ అధ్యక్షుడు పి. నెమలయ్య, క్లస్టర్, యూనిట్ బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏడీఈ పిచ్చయ్య

ముండ్లమూరు, మార్చి 18 : మండలంలో విద్యుత్ పెండింగ్ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు ఉంటాయని దర్శి డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈ పిచ్చయ్య చెప్పారు. ఆయన సోమవారం స్థానిక సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వీరబ్రహ్మం, లైన్‌మెన్లు ఆంజనేయులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించేలా చూడాలి

ముండ్లమూరు, మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఆ నియమావళి పాటించేలా చూడాలని ఎంపీడీవో శంకరరావు చెప్పారు. సోమవారం ఆయన గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై అధికార పార్టీకి చెందిన రంగులు, జెండాలు ఉన్నా 24 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. ఏ పంచాయితీలోనైనా తొలగించకుంటే ఆ కార్యదర్శులపై తీవ్రస్థాయిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి ఉన్నారు.

వైసీపీని వీడి 70 కుటుంబాలు టీడీపీలో చేరిక



ఇనిమెర్లలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి స్వాగతం పలుకుతున్న ఉగ్ర

పామూరు, మార్చి 17 : వైసీపీ అరాచక పాలనపై విసుగుచెందిన గ్రామీణ ప్రాంత ప్రజలు ఆ పార్టీని వీడుతున్నారని టీడీపీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. మండలంలోని పాతఇనిమెర్ల గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో ఓసీ బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 70 కుటుంబాలకు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో సోమవారం రాత్రి టీడీపీలో చేరారు. వారందరికి టీడీపీ కండువాలతో ఉగ్ర స్వాగతం పలికారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, గత పాలకులు ప్రజా సమస్యలను విస్మరించారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే జనసేన, బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుందని, ఒకసారి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ దశరథరాములు, ఎం గంగరాజు యాదవ్, జయరామిరెడ్డి, నరసింహారావు, వై ప్రసాద్‌రెడ్డి, ఎం హుసేన్‌రావు, జీ శ్రీనివాసులు, బీ మార్కు, యోబు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో తప్పెట్లతో ఘనస్వాగతం పలకగా మహిళలు ఉగ్రకు హారతి పట్టారు.

ఎన్నికల కోడ్ అమలులోనూ వివక్షే





పీసీపల్లి బ్యాంకు సెంటర్లో ముసుగు లేకుండా వైఎస్సార్ విగ్రహం, బస్టాండు సెంటర్లో ముసుగుతో ఎన్టీఆర్ విగ్రహం





మాధవరంలో తొలగించని వైసీపీ జెండాలు, తూర్పుగంగవరంలో ట్యాంక్‌పై వైసీపీ నేతల పోస్టర్లు

పీసీపల్లి, మార్చి 18 : నిన్న మొన్నటి వరకు సంక్షేమ పథకాల అమలులో అర్హులను గుర్తించడంలో వివక్ష చూపిన కొంతమంది అధికారులు ఎన్నికల కోడ్ అమలులోనూ వివక్ష చూపుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రాజకీయ నాయకుల చిత్రాలను తొలగించడంతో పాటు విగ్రహాల మొహాలు కనిపించకుండా ముసుగువేయాలని ఆదేశాలు ఉన్నాయి. మండల అధికారులు అధికార పార్టీ వారి పట్ల ఒకరకంగా, ప్రతిపక్షం వారి పట్ల మరో రకంగా వ్యవహరిస్తున్నారు. పీసీపల్లిలో బస్టాండు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం, ఆ పక్కనే బ్యాంకు సెంటర్లో వైఎస్సార్ విగ్రహాలు ఉన్నాయి. కోడ్ అమలులో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి వెంటనే ముసుగు తొడిగిన అధికారులు వైఎస్సార్ విగ్రహానికి మాత్రం ఎటువంటి ముసుగు వేయకుండా అలాగే వదిలేశారు. అటుగా వెళ్లే ప్రజలు ఈ రెండు విగ్రహాలను చూసి కోడ్ అమలుపరచడంలో ఇదేం వివక్ష అంటూ అధికారుల పక్షపాతాన్ని చర్చించుకుంటున్నారు.

తాళ్లూరు మండలంలోనూ యథేచ్ఛగా ఉల్లంఘన

తాళ్లూరు, మార్చి 18 : ఎన్నికల షెడ్యూల్ విడుదలై రెండు రోజులు కావస్తున్నా మండలంలోని పలుగ్రామాల్లో ఎన్నికల నియమావళిని గ్రామస్థాయి అధికారులు గాలికి వదిలివేశారు. ప్రతిపక్ష ఫ్లెక్సీలను, జెండాలను తొలగించిన పంచాయతీ కార్యదర్శులు వైసీపీకి చెందిన జెండాలు, ప్రచారగోడపత్రాలను అలాగే అట్టిపెట్టారు. మాధవరం గ్రామ ప్రధాన రహదారిలో రాములవారిగుడి వద్ద వైసీపీ జెండాలను తొలగించలేదు. మాధవరం, తూర్పుగంగవరం, లింగాలపాడు గ్రామాల్లో రోడ్ల వెంట భవనాలకు, వాటర్ ట్యాంక్‌లకు సీఎం జగన్, ఒంగోలు వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఫొటోలతో వేసిన ప్రచారగోడపత్రాలను అలానే ఉంచారు. ఎన్నికల కమిషన్ నియమావళిని తుచ పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా మండలంలోని అధికారులు తమకేమీ కాదన్నట్లు మిన్నకుంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టీడీపీలోకి వలసల జోష్

ఉక్కిరిబిక్కిరవుతున్న అధికార పార్టీ

సీఎస్‌పురం, హనుమంతునిపాడు మండలాల్లో భారీ చేరికలు

డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీ ముఖ్యనేతలు చేరిక



సీఎస్‌పురంలో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కనిగిరి, మార్చి 18 : కనిగిరి నియోజకవర్గంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసల ప్రవాహం సాగుతోంది. గ్రామాలకు గ్రామాలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతుంటే ఆ సెగతో వైసీపీ నాయకత్వం ఉక్కిరిబిక్కిరవుతోంది. నియోజకవర్గంలో రెండు నెలలుగా ఆరుమండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు, నాయకులు, కార్యకర్తలతో సహా ఆయా పార్టీని వీడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో వేలాదిమంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. సోమవారం సీఎస్‌పురం, హనుమంతునిపాడు మండలాల్లో వైసీపీ ముఖ్యనేతలు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. సీఎస్‌పురంలో మండలంలోని వైసీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ, వైసీపీ మండల మాజీ కన్వీనర్ పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ మన్నేపల్లి రమణయ్యలతో పాటు 100మందికి పైగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా హనుమంతునిపాడు మండలంలోని కోటతిప్పల గ్రామంలో వైసీపీకి చెందిన 9కుటుంబాలు, రసీదుపురం గ్రామంలో 4కుటుంబాలు, తిమ్మారెడ్డిపల్లిలో 7కుటుంబాలు, మహ్మదాపురం గ్రామంలో 2 కుటుంబాలు, ముప్పాళ్లపాడు గ్రామంలో 5కుటుంబాలు, కిష్టంపల్లి గ్రామానికి చెందిన 5 కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంతో పాటు టీడీపీ మినీ మేనిఫెస్టోతో పాటు కనిగిరి ప్రాంతాభివృద్ధికి తాను సంకల్పించిన 5 అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు.

సీఎస్‌పురంలో అధికార పార్టీకి భారీ షాక్

వైసీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ సహా50 కుటుంబాలు టీడీపీలో చేరిక

పామూరు,(సీఎస్‌పురం) మార్చి 18 : సీఎస్‌పురంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ, మండల వైసీపీ మాజీ కన్వీనర్ పాలుకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ మన్నేపల్లి రమణమ్మలతో కలిసి 50 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం వారందరికీ టీడీపీ ఇన్‌చార్జి ఉగ్రనరసింహారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ అవినీతి, అక్రమాలు, అరాచకాలతో విసుగుచెందిన ప్రజలు రానున్న ఎన్నికల్లో వారి పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మన్నేపల్లి రవికుమార్, సంగిశెట్టి శ్రీను, రమణయ్య, తిరుమలశెట్టి కిరణ్, నవీన్, వెంకటరత్నం, ఇండ్ల శ్రీను, మన్నేపల్లి సురేష్, గుర్రం నాగూరు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, జి. వెంకట్రామరాజు, బి. వెంకట్రాది, బొప్పూరి రాజేష్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

'ఉగ్ర గెలుపే నా లక్ష్యం'



మాట్లాడుతున్న దారపనేని

పామూరు, మార్చి 18 : కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడమే తన ఏకైక లక్ష్యమని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ చెప్పారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009లో ఉగ్ర గెలుపునకు తన వంతు కృషి చేశానని, అప్పట్లో వ్యవసాయ మార్కెట్ కమిటీకి రెండు పర్యాయాలు చైర్మన్‌గా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అందుకు కృతజ్ఞతగా 2024 ఎన్నికల్లో ఉగ్రకు మద్దతుగా తనవంతు గెలుపుకు కృషి చేస్తానన్నారు. త్వరలో ఉగ్రతో సంప్రదించి టీడీపీ మండలాల అధ్యక్షుల ఆధ్వర్యంలో తన మిత్ర బృందంతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ బలోపేతానికి, ఉగ్ర, మాగుంటల విజయానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. అలాగే మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీలోని జంగాలపల్లె గ్రామంలో శ్రీ గంగమ్మతల్లి దేవస్థాన నిర్మాణానికి దారపనేని చంద్రశేఖర్ రూ.1,1116లను విరాళం అందజేశారు.

బాధిత కుటుంబానికి టీడీపీ నేత ఆర్థిక సహాయం

దొనకొండ, మార్చి 18 : మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి మండల టీడీపీ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి సోమవారం ఆర్థిక సహాయం అందించారు. రుద్రసముద్రం ఎస్సీ కాలనీకి చెందిన గోనా జయరావు(33) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వైద్యశాలలో సోమవారం మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకుడు వెంకన్నచౌదరి హుటాహుటిన ఆ గ్రామానికి చేరుకొని జయరావు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు సాయం అందించారు. మృతిచెందిన జయరావుకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తుండడంపై పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, టీడీపీ నాయకులు వేగినాటి అల్లూరయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, పణిదపు వీరాంజనేయులు, శేషు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మార్టూరు, మార్చి 18: జాతీయ రహదారిపై ఒంగోలు వైపు వెళుతున్న కారు డివైడర్ ను ఢీకొని బోల్తాపడింది. సోమవారం మధ్యాహ్నం అమరావతి నూలు మిల్లు ఎదురుగా జరిగిన ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న యజమాని గుప్తా హరిబాబు క్షేమంగా బయటపడ్డారు. అద్దంకికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ హరిబాబు కారులో వ్యక్తిగత పనులు నిమిత్తం చిలకలూరిపేట వెళ్లి వస్తున్నారు. ఈక్రమంలో ముందువెళుతున్న వాహనం సడన్‌గా రోడ్డుకు అడ్డంగా రాగా, దానిని తప్పించడానికి సడన్ బ్రేక్ వేయగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని గుంటూరువైపు వెళ్లే రోడ్డులోకి వచ్చి బోల్తాపడింది. సమీపంలో ఉన్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కారు అద్దాలు పగులగొట్టి హరిబాబును క్షేమంగా బయటకు తీశారు. ఈసమయంలో హైవేలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

టీడీపీలోకి రవిబాబు

టంగుటూరు, మార్చి 18 : వైసీపీకి రాజీనామా చేసిన ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్, మండలంలోని వాసేపల్లిపాడుకి చెందిన లింగంగుంట రవిబాబు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయన త్వరలో సైకిలెక్కనున్నారు. తనతోపాటు మరికొంత మంది డైరెక్టర్లు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు రవిబాబు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన ఎస్సీలకు సంబంధించిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. దళితులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటామని ఆయన ప్రకటించారన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేస్తానని ఆయన జిల్లా ప్రజలకు హామీ ఇచ్చారని రవిబాబు వివరించారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

కనిగిరి నియోజకవర్గంలో 3,482 మందిలో

59మంది విద్యార్థులు గైర్హాజరు



దర్శిలో పరీక్ష హాలులోకి వెళుతున్న విద్యార్థులు

కనిగిరి, మార్చి 18 : పదో తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 21 పరీక్షా కేంద్రాల్లో 3,482మంది విద్యార్థులు పది పరీక్షలు రాయాల్సి ఉంది. వారిలో 59మంది వివిధ కారణాలతో గైర్హాజరైనట్లు డిప్యూటి డీఈవో చంద్రమౌళీశ్వర్ తెలిపారు. పరీక్షా హాలులోకి ఉదయం 9గంటలలోపే చేరుకున్నారు. విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించేందుకు వారి తల్లితండ్రులు తొలిరోజు కేంద్రాల వద్దకు వచ్చారు. కేంద్రాల్లోకి నిషేధిత వస్తువులైన ఎలక్ట్రానిక్స్ పరికరాలు, సెల్‌ఫోన్స్, వాచ్‌లు, ఈయర్‌ఫోన్స్ వంటి వాటిపై ప్రత్యేకంగా తనిఖీలు చేసి లోపలకు అనుమతించారు. అయితే కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీటి వసతి సక్రమంగా కల్పించటంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు చెప్పారు.

పామూరులో 15 మంది గైర్హాజరు

పామూరు, మార్చి 18 : పామూరులో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పామూరులో 4 సెంటర్లతో పాటు, మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో 1 పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. తొలిరోజు మొత్తం 719 మందికి గాను 904 మంది పరీక్షలురాశారు. అలాగే సీఎస్‌పురం మండలంలో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు.

దర్శిలో ప్రశాంతంగా...

దర్శి, మార్చి 18 : దర్శిలో పదో తరగతి పరీక్షలు సోమవారం ఎనిమిది కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 1564 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 743 మంది, ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 821 మంది పరీక్షలకు హాజరయ్యారు. అదేవిధంగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు 5 కేంద్రాల్లో, ఓపెన్ టెన్త్ పరీలు రెండు కేంద్రాల్లో జరుగుతున్నాయి. ఈ కేంద్రాలలో 1450 మంది పరీక్షలు రాశారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారు.

తాళ్లూరు మండలంలో 32 మంది విద్యార్థులు గైర్హాజరు

తాళ్లూరు, మార్చి 18 : మండలంలోని 6 పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 864 మంది విద్యార్థులకుగాను 832 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు. ఎస్సై వైవీ రమణయ్య పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మహిళా పోలీసులను, సిబ్బందిని బందోబస్తుగా ఏర్పాటు చేసి విద్యార్థుల హాల్‌టికెట్స్‌ను గేటు వద్దనే పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతిచ్చారు.

ముండ్లమూరులో 462 మంది విద్యార్థులు హాజరు

ముండ్లమూరు, మార్చి 18 : ముండ్లమూరులో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 462 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో కె.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 212 మంది విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 250 మంది విద్యార్థులు హాజరయినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎస్సై ఆంజనేయులు సందర్శించారు.

దొనకొండలో...

దొనకొండ, మార్చి 18 : దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో మొత్తం 495 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 14 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో సాంబశివరావు తెలిపారు. పరీక్షల చీఫ్‌లు రమణయ్య, ఖాదర్‌మస్తాన్‌లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నీ చర్యలు చేపట్టారు. ఎస్సై సంపత్‌కుమార్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ప్రారంభానికి నోచుకోని క్రీడా ప్రాంగణం

- చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో నిండిన వైనం
- ఎన్నికల పుణ్యమా అని తిరిగి వినియోగంలోకి
- నూతన హంగులతో ముస్తాబవుతున్న కేంద్రం



అలంకారప్రాయంగా క్రీడాప్రాంగణం

పర్చూరు, మార్చి 18: క్రీడాకారులకోసం రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన క్రీడా వికాస కేంద్రం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరింది. ముళ్ళ పొదలు, చిల్లచెట్లతో నిండిఉంది. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవటంతో అంధకారంలో అలానాపాలనకు నోచుకోక మూలనపడింది. ఈనేపథ్యంలో ఎన్నికల పుణ్యమా అని క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సమావేశాలు, సామగ్రి తదితర అంశాలకు సంబంధించి వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రాంగణంతోపాటు చుట్టూ ఉన్న చిల్లచెట్లు, ముళ్ళపొదలను తొలగించటంతో పాటు, భవనం లోపల ఉన్న గదులతోపాటు, ప్రాంగణాన్ని శుభ్రంచేసేవిధంగా చర్యలు చేపడుతున్నారు.

పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అధర్యంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులకు శిక్షణను అందించి జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు గత తెలుగుదేశం పార్టీ హయాంలో స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేతృత్వంలో రూ.2.5 కోట్ల వ్యయంతో ఎన్‌టీఆర్ క్రీడా వికాశం పేరుతో పర్చూరులో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అయితే, పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దశలో ప్రభుత్వం మారిపోయింది. అరకొర పనులు పూర్తిచేసి ప్రారంభించాల్సిన క్రీడా ప్రాంగణం గురించి నూతన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు పూర్తవుతున్న తరుణంలో కూడా ప్రారంభానికి నోచుకోలేదు. దీనిపై క్రీడాకారుల్లో విమర్శలు వెల్లువెత్తాయి.

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 19 మార్చి 2024



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పగడ్బందీగా పది పరీక్షలు

- పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రంజిత్ బాషా
- 96.38శాతం హాజరు నమోదు

బాపట్లటౌన్, మార్చి 18 : జిల్లాలో సోమవారం నుంచి పదిపరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9గంటలకే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. అన్నికేంద్రాలను నోఫోన్ జోన్‌లుగా ప్రకటించారు. దీంతో ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది విద్యార్థులను పోలీసు సిబ్బంది తనిఖీ చేసి లోపలకి అనుమతించారు. వేసవి దృష్ట్యా వైద్యసిబ్బందిచే ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, ఇతర అత్యవసర మందులు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించటంతోపాటు పోలీసులచే బందోబస్తును ఏర్పాటుచేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్, కంప్యూటర్ సెంటర్‌లను మూసివేయించారు.



ఈపూరుపాలెంలో దివ్యాంగ విద్యార్థినిని పరీక్షా హాలులోకి వీపుపై మోసుకొని తీసుకెళుతున్న తల్లి

తెలుగు పరీక్షకు 630మంది గైర్హాజరు


తొలిరోజు జిల్లాలో 108 కేంద్రాలలో 17,436మంది హాజరు కావాల్సి ఉంది. అందులో 16,806 మంది విద్యార్థులు కాగా 630మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తంగా 96.38శాతం హాజరు నమోదైంది. జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు కర్లపాలెం, చందోలు పరీక్షా కేంద్రాలను తనిఖీచేశారు. మరో ఆరు పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు : కలెక్టర్

పరీక్షాకేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్‌బాషా హెచ్చరించారు. తొలిరోజు బాపట్లలో మున్సిపల్ హైస్కూల్, బాపట్ల హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నామని, ఆయా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(మంగళవారం)
సహోరీ (ఉదయం) 4.56 (బుధవారం)

- వేసవి రాకముందే ప్రమాద ఘంటికలు
- రోజురోజుకూ అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- మొక్కజొన్నకు గడ్డు పరిస్థితి
- కాల్వల్లో చుక్కనీరు లేదు.. బోర్లు వేస్తే నీరు రాదు
- కృష్ణా తీరంలో తాగునీటికీ కష్టాలు
- ట్యాంక్ నిండాలంటే మోటర్ పూటంతా ఆడాల్సిందే..





భూగర్భ జలాలు పడిపోవటంతో విద్యుత్తు మోటారు నుంచి చిన్నపాటి దారగా వస్తున్న నీరు

జలగండం

ఇప్పుడిప్పుడే ఎండ వేడి పెరుగుతుంటే, దీనికి తగ్గట్టుగానే భూగర్భ జలాలు కూడా రోజుకో విధంగా అడుక్కు పోతున్నాయి. పచ్చని పైర్లతో కళకళలాడే కృష్ణా తీరంలోనూ గుక్కెడు నీరు బయటకు తోడాలంటే గగనమైపోతోంది. డెల్టాలో రబీ పంటలకు నీటి కష్టాలు తప్పటం లేదు. మొక్కజొన్న చేలల్లో కూడా నేల నెర్రెలిస్తోంది. కొన్నిచోట్ల పంట ఎండుతుంటే, దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క ఒక ఎకరా చేను తడపటానికి రోజంతా మోటర్ వదిలితేనే అంతంతమాత్రంగా ఉంటోంది. ఒక్క గంటకూడా వదలకుండా పది రోజులుగా మొక్కజొన్నకు తడులు పెట్టేందుకు మోటార్లను ఆడిస్తూనే ఉండటంతో చివరకు కృష్ణా నదికి పక్కనే ఉన్న గ్రామాల్లోనూ తాగునీటికి కటకట ఏర్పడింది. పంపులు నీరు రాక మొరాయిస్తున్నాయి. అత్యంత వేగంగా నీటిని లాగే మోటార్లు మినహా, సాధారణ మోటార్లు ఉన్నవారికి రోజంతా మోటర్ వేసినా ట్యాంక్ నిండని పరిస్థితి. పుష్కలంగా నీరు ఉండే డెల్టా ప్రాంతం పరిస్థితే ఇలా ఉంటే, పలనాడు జిల్లాలో పరిస్థితి ఇంకా ఎంత ఘోరంగా ఉందో అని డెల్టా ప్రజలు మాట్లాడుకోవడం కనిపిస్తోంది.

తెనాలి, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): గుంటూరు డివిజన్‌లో గత ఏడాది ఫిబ్రవరిలో 4.29 మీటర్ల లోతులో భూగర్భ జలాలుంటే, ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రెండు సంవత్సరాల హెచ్చుతగ్గుల వ్యత్యాసం -0.70 మీటర్లకు పడిపోయింది. ఇటు తెనాలి డివిజన్‌లోనూ 2023 ఫిబ్రవరి నాటికి 4.29 మీటర్ల లోతులో నీరు అందుబాటులో ఉంటే, ఈ రెండు సంవత్సరాల్లోని ఫిబ్రవరి నెల హెచ్చుతగ్గులు చూస్తే -0.58 మీటర్ల లోతుకు పడిపోయింది. బాపట్ల జిల్లాలో మొత్తం 30 చోట్ల భూగర్భ జలమట్టాలను పరిశీలిస్తే, గతేడాది ఫిబ్రవరిలో 1.61 మీటర్ల లోతులో నీరు సగటున అందుబాటులో ఉంది. అయితే గత సంవత్సరం ఫిబ్రవరి, ఈ సంవత్సరం ఫిబ్రవరి హెచ్చుతగ్గుల ప్రకారం చూస్తే -0.04 మీటర్ల వరకు దిగిపోయింది. మండలాలవారీగా చూస్తే, కొన్ని మండలాల్లో అయితే -1.13 మీటర్ల నుంచి -1.98 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. ఇప్పుడే ఇంతటి దారుణ పరిస్థితులు నెలకొంటే, రేపటి వేసవి తీవ్రతకు చుక్కనీరు దొరకుతుందా! అనే భయం మొదలయింది.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

2023 ఫిబ్రవరి నెల, ఈ ఏడాది ఫిబ్రవరి నెల మధ్య భూగర్భ జలాల హెచ్చుతగ్గులను పరిగణనలోకి తీసుకుంటే, గుంటూరు జిల్లాలోని గుంటూరు వెస్ట్ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా -1.57 మీటర్లమేర నీటిమట్టం పడిపోతే, తెనాలిలో -0.64 మీటర్లు, పొన్నూరు పరిధిలో -0.52, మంగళగిరి పరిధిలో -0.58, కొల్లిపరలో -0.52, దుగ్గిరాల పరిధిలో -0.20 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇటు బాపట్ల జిల్లాలోని కృష్ణా తీరంలో భారీగానే నీటి నిల్వలు అడుకుగు చేరాయి. అమృతలూరు మండలంలో -1.98 మీటర్లు, బాపట్ల పరిధిలో -1.59, భట్టిప్రోలు, వేమూరు ప్రాంతంలో -1.16, పరిధిలో -1.13, కొల్లూరు పరిధిలో -0.91 మీటర్ల మేర నీటి మట్టం లోతుకు పోయింది. కృష్ణా తీరంలో సాధారణంగా భూగర్భ జలాలు మైనస్ స్థాయికి పడిపోకుండా, కొంతమేరయినా అందుబాటులోనే ఉండేవి. కానీ వర్షపాతం తగ్గిపోవటం, ఇసుక తవ్వకాలు ఈ ప్రాంత వాసులకు శాపంగా మారాయి. ఏటా సాధారణంగా నమోదు కావలసిన వర్షపాతాలు కూడా భారీగానే పడిపోయాయి. 2020లో మాత్రమే సాధారణ వర్షపాతానికి మించి వర్షం పడింది. సాధారణంగా ఈ జిల్లాల్లో 9.50 మి.మీటర్ల వర్షపాతం నమోదు కావలసి ఉంటే, 2020లో సగటున 12.50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. 2021లోనూ 3.50 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది. 2022లో వర్షపాతం మాత్రమే 0.1 మిల్లీ మీటర్లు నమోదయితే, నీటి మట్టాలు మాత్రం 3.36 మీటర్లకు పెరిగింది. ఆ సమయంలో కృష్ణా నదికి, కాల్వలకు నీరు రావటంతో నీటి మట్టాలు పెరిగాయి. 2023లోనూ 0.10 మి.మీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది.

తీరంలోనూ తాగునీటి కష్టాలు..

చుండూరు మండలం చినగాదెలవర్రులో అయితే మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు నీరందక, నేలపై భాగంలో అమర్చిన మోటార్లను తీసేసి, ఐదు నుంచి పది అడుగుల లోతులో గుంతలు తీసి, వాటిలో బోర్లకు అమర్చుతున్నారు. గత వారం నుంచి ఈ పరిస్థితి మరీ ఎక్కువయింది. కొల్లిపర, తెనాలి, వేమూరు, అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. అటు అమృతలూరు మండలంలోనూ గతంలో చూడని నీటి కరువును చూస్తున్నామని, ఇంటి దగ్గర పంపులు పనిచేయటంలేదని, మోటార్లు వేసినా నీరు రావటంలేదని, చేసేదిలేక పది నుంచి 15 అడుగుల లోతులో గుంతలు తీసి, అదే బోర్లను కత్తిరించి అక్కడ మోటార్లు అమర్చాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. మరోపక్క కృష్ణా తీరంలోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకూ నీటి కష్టాలు తప్పటంలేదు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల,కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో అరటి, చెరకు,తమలపాకు,కంద,మొక్కజొన్న,పసుపు వంటి వాణిజ్య పంటలు సాగులో ఉన్నాయి. వీటికీ నీటి తడు లు అందించటానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే మోటార్లు భూమిలో పది నుంచి 15 అడుగుల లోతు గోతులు తీసి, వాటిలోపల అమర్చితే, ఇప్పుడు వాటికి కూడా నీరు అందటం లేదు. ఎకరా పొలానికి నీరందించటానికి రెండు రోజులు పడుతోందని రైతులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఏప్రిల్, మే నెలల్లో చుక్కనీరు అందదని, రైతులు భయపడుతున్నారు. అటు తీరంలో నూ తాగునీటికి ఇక్కట్లు తప్పేలా లేదు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో భూగర్భ జలాలు అడగంటిపోతున్నాయి. గత రెండు సంవత్సరాల సగటుతో పోల్చితే ఈ సంవత్సరం అప్పుడే నీరు అడుగుకు చేర టం కలవర పెడుతున్న అంశం. వర్షపాతం తగ్గిపోవటం, కృష్ణా తీరంలో మితిమీరిన ఇసుక తవ్వకాలు, కాల్వలకు సరిపడా నీరు అందక రబీ పంట కోసం భూగర్భ జలాలపై ఆధారపడటంతో సమస్య మరింత జటిలమైపోతోంది. జనవరి, ఫిబ్రవరిలో తీసుకున్న భూగర్భ జలమట్టాలే మైనస్ స్థాయికి పడిపోతే, ఈ మార్చి, రానున్న నెలల్లో పరిస్థితి ఇం కెంత గడ్డుగా మారనుందనేది అంతుబట్టని విషయం.



అమృతలూరులో బోరుకు పక్కనే గొయ్యి తీసి మోటారు అమర్చిన చిత్రం

రబీ పంటకు గడ్డు కాలం

కృష్ణా డెల్టాలోని బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లా పరిధిలో రబీ సాగుకింద 4.5 లక్షల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు చేశారు. ఇప్పుడు పంట చాలావరకు కంకి దశలో, కండె గింజ వృద్ధి చెందే దశలో ఉంది. అయితే దీనికి నీరు అందని పరిస్థితి. కృష్ణానది నుంచి ఖరీఫ్‌కు సరిపడా నీరు కాల్వలకు అందేలా నిండుగా వదిలితే, రబీలో పంటకు మాత్రం కాల్వల అడుగున పారుదల అయ్యేలా వదిలేశారు. ఆ నీటినే ఆయిల్ ఇంజన్‌లు, మోటార్ల సాయంతో రైతులు తడులు పెట్టుకునేవారు. అయితే ఈ సారి డెల్టా కాల్వలకు చుక్కనీరు ఇవ్వలేని పరిస్థితి. జలాశయాల్లో నీరు అడుగుకు చేరితే, ఇటు రబీ పంటకు నీరిచ్చేటంత అవకాశాలు లేకుండాపోయాయి. పులిచింతల నీరు తాగునీటికి మాత్రమే ఉపయోగించాలి. ఇటు బ్యారేజికి నీరు వచ్చిచేరే అవకాశాలు లేకపోవటంతో కాల్వలకు నీటిని వదలటంలేదు. కనీసం సముద్రతీర మండలాల్లో తాగునీటి చెరువులు నింపుకొనేందుకు కూడా నీరు ఇవ్వలేని దయనీయ పరిస్థితి. పక్షం రోజుల క్రితం కొన్ని కాల్వలకు నీరు వదిలామనిపించి, ఎవరిని అప్రమత్తం చేయకుండా, చెరువులకు నీటిని నింపుకునే అవకాశం లేకుండా రోజుల వ్యవధిలోనే నీటిని కట్టేశారు. దీంతో తాగునీటికీ కటకట ఏర్పడింది. ఇటు కృష్ణానదికి ఎగువన ఉన్న మండలాల్లోనూ భూగర్భ జలాలు అడుగంటటం, మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు నీటిని తోడేస్తుండటంతో ఈ ప్రాంతాల్లోనూ పంపులు మొరాయించాయి. ఒక్కఎకరం మొక్కజొన్నకు నీరు పెట్టాలంటే రెండు రోజులుపైనే పట్టటం, పగలు నీరు పెద్దగా అందకపోవటంతో అంతా రాత్రి సమయాల్లో మోటార్లు ఆడిస్తున్నారు. ఇటు గృహ అవసరాలకోసం వేసే మోటార్లు కూడా సమయాలు చూసుకుని వెయ్యాల్సిన పరిస్థితి. వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంక్ నిండటానికి సాధారణంగా అర్ధగంటలోపు సమయం పడితే, ఇప్పుడున్న పరిస్థితుల్లో గంటన్నర నుంచి రెండు గంటల వరకు పడుతోంది. సబ్‌మెర్సిబుల్, జెట్ మోటార్లున్నవారు ఒకసారి ట్యాంక్ నిండటానికి రెండు నుంచి 5 నిముషాలు మోటార్లు ఆడించేవారు. ఇప్పుడు అవికూడా 15 నిముషాల నుంచి అర్ధగంట వరకు సమయం పడుతోందంటున్నారు.



చిన గాదెలవర్రులో గోతులు తీసి దానిలో మోటార్లు అమర్చుతున్న చిత్రం



కోడ్ ఉల్లంఘనా..
సీవిజిల్ ఉందిగా..

- రియల్‌టైంలో ఫోటో/వీడియో/ఆడియో పంపించే అవకాశం
- 100 నిమిషాల్లో తీసుకొన్న చర్య గురించి ఈసీఐ నుంచి సమాధానం

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో జిల్లా వ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనలపై ఎవరికి ఫిర్యాదు చేయాలనే దానిపై ప్రజల్లో అయోమయం నెలకొని ఉన్నది. కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబరుని ఏర్పాటు చేసినప్పటికీ వాటికి ఫిర్యాదు చేసేందుకు చాలామంది సంశయిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు సీవిజిల్ యాప్‌ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మొబైల్ నెంబరు, పేరు, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి లాగిన్ అయి కళ్ల ముందు జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను ఫోటో/వీడియో/ఆడియో ద్వారా రికార్డింగ్ చేసి నివేదించ వచ్చు. ఒక వ్యక్తి ఎన్ని ఫిర్యాదులైనా సీవిజిల్ ద్వారా పంపిం చే సదుపాయం ఉన్నది. అలాగని తప్పుడు ఫిర్యాదులు చేయ డానికి వీల్లేదు.

ఎన్నికల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకొనేందుకు ఎలక్షన్ కమిషన్ ప్రత్యేకించి సీవిజిల్ యాప్‌ని రూపొందించింది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకొని ఉల్లంఘనలపై ఒక అస్త్రంగా వినియోగిం చవచ్చు. ఓటరు ఫిర్యాదుని పంపగానే ఆ సమాచారం కలెక్ట రేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో ప్రతిధ్వనిస్తుంది. దానిని ఫీల్డ్ యూనిట్‌కి ఐదు నిమిషాల వ్యవధిలోనే పంపు తారు. ఫీల్డ్ యూనిట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, రిజర్వు టీంలు ఉంటాయి. ప్రతీ ఫీల్డ్ యూనిట్‌కి జీఐఎస్ ఆధారిత సీవిజిల్ ఇన్వెస్టిగేటర్ మొబైల్ యాప్ ఉంటుంది. అది నేరుగా ఫిర్యాదు ఏ ప్రాంతం నుంచి వచ్చిందో అక్కడికి చేరుకొనే మార్గం చూపిస్తుంది. ఫీల్డ్ యూనిట్ తీసుకొన్న చర్యని ఇన్వెస్టిగేటర్ యాప్ ద్వారా సంబంధిత రిటర్నింగ్ అధికారికి పరిష్కారం కోసం పంపుతారు. అంతా సవ్యంగా ఉంటే ఆ సమాచారాన్ని జాతీయ గ్రీవియన్స్ పోర్టల్‌కి కేంద్ర ఎన్నికల సంఘం తదుపరి చర్యలకు పంపుతారు. ఈసీ తీసుకొన్న చర్యని 100 నిమిషాల వ్యవధిలోనే పౌరుడికి తెలియజేస్తారు. ఈ దఫా ఎన్నికల్లో ఇదొక విప్లవాత్మకం కానుంది.

సీవిజిల్ వినియోగదారుడు ఫోటో/వీడియో/ఆడియోని రికార్డు చేయగానే దానిని ఫిర్యాదు చేయడానికి ఐదు నిమిషాల సమయం ఉంటుంది. గతంలో తీసిన ఫోటోలు, వీడియోలను అప్‌లోడింగ్ చేయడానికి యాప్ అనుమతించదు. అలానే తీసిన ఫోటోలు, వీడియోలు, ఆడియోలను గ్యాలరీలో స్టోర్ చేసుకొనేందుకు కూడా అవకాశం ఇవ్వదు. తప్పుడు ఫిర్యాదులను డ్రాప్ చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కి ఉంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కి సంబంధించిన ఫిర్యాదు కాకపోతే దానిని ఈసీఐ ప్రధాన వెబ్‌సైట్/1950 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు.



పైపులైను పగిలినా
పట్టించుకోరా..

వృథాగా మురుగు కాల్వలోకి పోతున్న మంచినీరు

బాపట్ల, మార్చి 18 : పట్టణ ప్రజలు తాగునీటికి నానా కష్టాలు పడుతున్నారు. సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లో నీటి పరిమాణం తక్కువగా ఉండటంతో ప్రతిరోజూ నీటిని సరఫరా చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. ఉప్పరపాలెం రోడ్డులో సిమెంట్ రోడ్డుపై పైపులైన్ పగిలి మంచి నీరంతా కాల్వలోకి ప్రవహిస్తుంది. రోడ్డు వేసే సమయంలో పైపులైన్‌ను పూర్తి స్థాయిలో ఆధునీకీకరించక పోవటంతో పైపులైన్ దెబ్బతిని నీరు వృథా పోతుంది. అయినా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే హైవే రోడ్డు నిర్మాణం పనులు చేస్తూ కాంట్రాక్టర్‌లు విచ్చలవిడిగా 100కుపైగా పైపులైన్‌లు ధ్వంసం చేసి నీటిని వృథా చేయటంతో రోజూ సరఫరా చేయాల్సిన నీరు రెండు రోజులకొకసారి సరఫరా చేసే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా వృథా అయితే వేసవి రాక ముందే తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి. కాగా ఈ విషయమై మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా పైపులైన్ పగిలినట్లు తన దృష్టికి రాలేదన్నారు. వెంటనే పరిశీలించి మరమ్మతులు చేస్తామని చెప్పారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మంచినీరు

ట్రయల్ రన్
విజయవంతం

- అధికారుల పటిష్ట ఏర్పాట్లు
- ఆసక్తిగా తిలకించిన ప్రజలు



సుఖోయ్ యుద్ధ విమానం

మేదరమెట్ల , మార్చి 18: జాతీయ రహదారిలో నిర్మించిన అత్యవసర రన్‌వేపై విమానాల ట్రయల్ రన్ విజయవంతమైంది. 8 విమానాలు రన్‌వేపై ప్రయాణించాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసక్తితో గమనించారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఏఎస్పీ పాండురంగ విఠలేశ్వర్, 500 మంది సిబ్బందితో రన్‌వేపై చుట్టుపక్కలకు ప్రజలు రాకుండా భద్రతా చర్యలు చేపట్టారు. జాతీయ రహదారికి చెందిన నెల్లూరు, ఒంగోలు పీడీలు దివేష్ గోయల్, విద్యాసాగర్‌లు జాతీయ రహదారిలో ల్యాండింగ్ ట్రయిల్ రన్‌కు అవసరమైన చర్యలు చేపట్టారు. ఎ యిర్స్ ఫోర్స్ అధికారులు గత నాలుగు రోజులుగా ఇక్కడ మకాం వేసి ట్రయల్ రన్ విజయవంతానికి ఏర్పాట్లు చేశారు. ల్యాండింగ్ ట్రయల్ రన్ విజయవంతం అవడంతో వైమానిక దళ ఉన్నతాధికారులు విజయ్ మీనన్, జేపీ యాదవ్‌లు ఎస్పీ వకుల్ జిందాల్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొరిశపాడు తహసీల్దార్ బి.సుశీల, ఎంపీడీవో సమతవాణి, చీరాల డీఎస్పీ బేదపూడి ప్రసాద్, అద్దంకి రూరల్, పట్టణ సీఐలు శివరామకృష్ణారెడ్డి, కృష్ణయ్యలు, కొరిశపాడు, మేదరమెట్ల, యద్దనపూడి ఎస్ఐలు శివయ్య, చంద్రశేఖర్, జీవీ చౌదరి, పలువురు పోలీస్ అధికారులు బందోబస్తులో పాల్గొన్నారు.



రన్‌వేపై ప్రయాణిస్తున్న హాక్కు విమానం



రన్‌వేపై దిగిన ఏఎన్ 32 విమానం

ఇన్‌చార్జి డీపీవోగా ఉషారాణి బాధ్యతలు స్వీకరణ



ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన ఉషారాణికి బొకే ఇస్తున్న ఏవో శివప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీపీఓగా పనిచేస్తున్న జీవీనారాయణరెడ్డిని రిలీవ్ చేస్తూ ఆదివారం రాత్రి కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జిగా ఉషారాణిని నియమించడంతో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. కాగా ఉషారాణిని జిల్లా పంచాయతీ కార్యాలయ పరిపాలనా అధికారి శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జి.రామకృష్ణతో పాటు పలువురు ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా మాధురి బాధ్యతలు స్వీకరణ

- జాలిరెడ్డి బాధ్యతల నుంచి రిలీవ్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా కే మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జాలిరెడ్డిని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం రాత్రి రిలీవ్ చేశారు. అదేవిధంగా ఐసీడీఎస్ పీడీగా పనిచేస్తున్న మాధూరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఉదయం జడ్పీ కార్యాలయంలో జాలిరెడ్డి నుంచి మాధూరి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన మాధూరిని పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



దర్శిలో పరీక్ష హాలులోకి వెళుతున్న విద్యార్థులు

ఒంగోలు(విద్య), మార్చి 18 : జిల్లాలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరిగాయి. జిల్లాలోని 170 కేంద్రాల్లో 30,082 మందికిగాను 29,317 మంది హాజరు కాగా 765మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల ప్రధాన ద్వారాల వద్దనే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలికి అనుమతించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లతోపాటు అత్యవసరాల కోసం వైద్యశాఖ సిబ్బందిని నియమించారు. కేంద్రాల సమీపంలోని జెరాక్స్ సెంటర్లను మూసివేయించారు. కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీరు, టాయిలెట్ సౌకర్యం కల్పించారు. పూర్తిస్థాయిలో విద్యార్థులకు కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేశారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు 48 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షల పరిశీలకులు ప్రసన్నకుమార్, డీఈఓ డి.సుభద్రలు ఆరు కేంద్రాలను తనిఖీ చేయగా ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు 60 కేంద్రాలను సందర్శించారు. మొదటిరోజు కావడంతో విద్యార్థులు ముందుగా ఆలయాలకు వెళ్ళి పూజలు చేసి పరీక్షకు హాజరయ్యారు.

నత్తనడకనవాటర్ గ్రిడ్ పనులు

2022లోనే పూర్తి కావాల్సిన వెలిగొండ పనులు

వైసీపీ నిర్లక్ష్యం

మరో ఏడాదికి కూడా పూర్తి కావడంపై అనుమానమే

మార్కాపురం రూరల్, మార్చి 15: వెలిగొండ ప్రాజెక్టును ఆర్భాటంగా ముఖ్యమంత్రి ఇటీవల దోర్నాల మండలం కొత్తూరు వద్ద జాతికి అంకితం చేశారు. వాస్తవంగా వెలిగొండ ప్రాజెక్టు నల్లమల్ల సాగర్ గొట్టిపడియ డ్యాం వద్ద నిర్మిస్తున్న వాటర్ గ్రిడ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.1290కోట్లతో మార్కాపురం, కనిగిరి, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 25 మండలాల్లోని 1697 గ్రామాలకు తాగునీరు కొళాయిల ద్వారా అందించేందుకు ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం అక్టోబర్ 2021వ సంవత్సరంలో మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి శంకుస్థాపన చేశారు. 2022 అక్టోబర్‌కు ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేటికీ పనులు నత్త నడకనే సాగుతున్నాయి. పనులు పూర్తి చేయడానికి ఇంకో సవంత్సరంపైనే పడుతుందని అధికారులు తెలియజేశారు. ప్రచార ఆర్భాటం కోసం వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించామని వైసీపీ ప్రభుత్వం చెప్పుకుంటుందని పశ్చిమ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. వాస్తవంగా పరిశీలిస్తే ప్రాజెక్టు ద్వారా గ్రామాలకు తాగునీటిని అందించాలంటే మరో రెండు సంవత్సరాల సమయం కచ్చితంగా పడుతుందని అందరూ చర్చించుకుంటున్నారు.

ఎన్నికల నియమావళి పాటించేలా చూడాలి

ముండ్లమూరు, మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఆ నియమావళి పాటించేలా చూడాలని ఎంపీడీవో శంకరరావు చెప్పారు. సోమవారం ఆయన గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. ప్రధానంగా గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై అధికార పార్టీకి చెందిన రంగులు, జెండాలు ఉన్నా 24 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. ఏ పంచాయితీలోనైనా తొలగించకుంటే ఆ కార్యదర్శులపై తీవ్రస్థాయిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సీన్ రివర్స్

అభ్యర్థులకు తలనొప్పిగా మారిన జగన్ వ్యూహం

ఒక సెగ్మెంట్‌లో కొత్త గణం.. మరోచోట కొరత

మాపై పరాయి పెత్తనం ఏంటంటూ ప్రశ్నలు

ముందుకు నడిచే నాయకుడు లేక మరోచోట ఇబ్బందులు



ప్రకాశం జిల్లా వైసీపీ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికలో అధికార వైసీపీ కొనసాగించిన బదిలీల తంతు తలనొప్పిగా మారింది. ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జులపై ఉన్న అసంతృప్తి, అసమ్మతులను తొలగించేందుకు ఈ బదిలీల పర్వానికి శ్రీకారం పలికిన విషయం తెలిసిందే. జగన్ ప్రత్యేక దృష్టితో ఆ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు మినహా మిగిలిన అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థిని మార్చటం ఆ వ్యూహంలో భాగమే. కొత్త వారిని రెండు, మూడుచోట్ల మాత్రం రంగంలోకి తీసుకొచ్చి మిగిలిన చోట్ల ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులనే అటుఇటు మార్పు చేశారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే మంత్రి సురేష్‌ను కొండపి, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మంత్రి నాగార్జునను సంతనూతలపాడుకు, కనిగిరి ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్‌ను కందుకూరుకు, మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుని మార్కాపురానికి మార్పుచేసిన విషయం తెలిసిందే. దర్శికి మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డిని రంగంలోకి తీసుకురాగా, వైపాలెం, అద్దంకి, పర్చూరు అసెంబ్లీ స్థానాలకు స్థానికేతర నాయకులకు టికెట్లు కేటాయించారు. చీరాల ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్‌కు, కనిగిరిలో ఒక జెడ్పీటీసీ సభ్యుడికి అవకాశం ఇచ్చారు.

ఇటు కొత్త... అటు కొరత

ఆయా నియోజకవర్గాల్లో తాజా పరిస్థితిని పరిశీలిస్తే బదిలీల వ్యవహారం ఆ పార్టీకి ఎంత తలనొప్పిగా మారిందో అర్థం అవుతుంది. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు నుంచి రంగంలోకి దించారు. దీంతో ఇప్పటివరకు తన నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో కీలకంగా వ్యవహరించిన ఆయన కుటుంబసభ్యులు, వారికి ఉన్న ముఖ్యనాయకులు గిద్దలూరు నియోజకవర్గానికి చేరారు. కొనకనమిట్ల మండలంలో వైసీపీపై పెత్తనం చెలాయించే మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి దగ్గర నుంచి మార్కాపురం, పొదిలి మండలాల్లో కూడా వైసీపీ పక్షాన ఎన్నికల సమయంలో కీలక బాధ్యతలు వహించే వారంతా గిద్దలూరుకు చేరారు. ఉండేందుకు ఇల్లు తీసుకుని మరి పనిచేస్తున్నారు. దీంతో మార్కాపురం నుంచి రంగంలోకి వచ్చిన అన్నా రాంబాబు, కొన్ని మండలాలు గ్రామాల్లో కొత్త నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిద్దలూరు నుంచి రాంబాబు అనుచరులు మార్కాపురం వచ్చింది తక్కువే అయినా రెండు చోట్ల మార్పిడి సక్రమంగా కనిపించటం లేదు. వైసీపీలో కిందిస్థాయి క్రియాశీలకంగా వ్యవహరించే నాయకులు, అభ్యర్థులతో అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. గిద్దలూరులో అభ్యర్థి స్థానికుడు కాదు. పైగా ఆయన తరఫున పెత్తనం చేసేవారంతా పరాయి వారే. దీన్ని మేము భరించలేమంటూ వైసీపీ నాయకులు ఆ పార్టీకి దూరమవుతున్నారు.

అభ్యర్థుల ఎంపికలో వైసీపీ అనుసరించిన బదిలీలల వ్యూహం పార్టీకే తలనొప్పిగా మారింది. అభర్థులతోపాటు వారి అనుచరులు కొత్త నియోజకవర్గాలకు చేరిపోయారు. దీంతో వేరేచోట నుంచి వచ్చిన అభ్యర్థి కొత్త కావటంతోపాటు, ఆయన అనుచరుల పెత్తనాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. మా మీద పరాయి పెత్తనం ఏమిటంటూ ఎదురు తిరుగుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులు వేరేచోటకు వెళ్లటంతో వారి నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థికి చిక్కులు ఎదురవుతున్నాయి. దీంతో ఒక నియోజకవర్గంలో నాయకుల కొరత సమస్యకాగా, మరోచోట పెత్తనం చేసే నాయకులు కొత్త కావటం సంకటంగా మారింది. దీంతో మొదటికే మోసం వస్తుందన్న ఆందోళనలో వైసీపీ అభ్యర్థులు పడిపోయారు. మొత్తగా బదిలీలతో స్థానిక అసంతృప్తులకు బ్రేక్ వేయాలనుకున్న జగన్ వ్యూహం రివర్స్ అవుతుందన్న ఆందోళన పెరిగిపోయింది.

- వైపాలెంకు చెందిన మంత్రి సురేష్ కొండపిలో పోటీచేయగా, కొండపి నియోజకవర్గానికి చెందిన చంద్రశేఖర్ వైపాలెంలో పోటీలో ఉన్నారు. ఇంతవరకు వైపాలెంలో మంత్రి సురేష్, అభ్యర్థి చంద్రశేఖర్ కలిసి ప్రచారంలో పాల్గొన్న దాఖలాలు లేవు. నియోజకవర్గంలో వైసీపీలో ఉన్న బలమైన నాయకులు ఒక్కొక్కరుగా టీడీపీలో చేరిపోతున్నారు. మంత్రి సురేష్ అనుకూల, వ్యతిరేక గ్రూపుల సమన్వయంలో చంద్రశేఖర్ వ్యూహం చతికిలపడింది. మంత్రి సురేష్ తరఫున వ్యూహరకర్తలుగా పనిచేసే వారంతా కొండపి చేరారు. కొండపిలో సురేష్ స్థానిక నేతలకు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికి వైపాలెం నుంచి వచ్చిన ఆయన మనుషుల తీరు, కీలక అంశాల్లో పెత్తనాన్ని, కొండపి నాయకులు భరించలేకపోతున్నారు. చాలామంది వైసీపీ కిందిస్థాయి నాయకులు సైలెంట్ అయిపోవటం అందుకు నిదర్శనం. ఇక కొండపి ఇన్‌చార్జిగా ఉన్న అశోక్‌బాబును బాపట్ల జిల్లా వేమూరు బదిలీ చేయటంతో గ్రామాల్లో కీలకంగా వ్యవహరించే ఆయన అనుచరులంతా వేమూరులో పనిచేస్తున్నారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా కందుకూరు నియోజకవర్గంలో పోటీలో ఉండగా ఆయన అనుచరులు అక్కడే తిరుగుతున్నారు. కనిగిరిలో పోటీలో ఉన్న నారాయణను బొమ్మను చేసి కొందరు నాయకులే పెత్తనం చేయటంతో శ్రేణులంతా పోలోమని టీడీపీలో చేరిపోతున్నారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చి ఎస్ఎన్‌పాడులో పోటీ చేస్తున్న మంత్రి నాగార్జున పరిస్థితి అంతే. చీమకుర్తి మండలంలో కీలకంగా వ్యవహరించే బూచేపల్లి శివప్రసాదరెడ్డి దర్శిలో రంగంలో ఉండటంతో చక్రం తిప్పే నేతలంతా ఆ నియోజకవర్గంకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ఇంత వరకు ప్రచారంలోకి రాకపోవటంతో ఆయన వర్గంలోని అత్యధికులు నాగార్జునకు దూరంగా ఉన్నారు. నాగార్జున తరఫున వేమూరు నుంచి వచ్చి పెత్తనం చేస్తున్న వారి చర్యలు సరికొత్త సమస్యను సృష్టిస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో గుంటూరు జిల్లా నుంచి వచ్చిన హనిమిరెడ్డి తరఫున ఆయన కుటుంబ సభ్యులు పెదకూరపాడు నుంచి నాయకులు పెత్తనం చేయటం స్పష్టంగా కనిపిస్తోంది. పర్చూరు నియోజకవర్గంలో రంగంలో ఉన్న బాలాజీ, చీరాల వాసి కావటంతో అక్కడ ఉన్న పరిస్థితుల నేపథ్యంలో పర్చూరులోని ఆమంచి వర్గీయులు ఎవరూ ఆయనకు సహకరించటం లేదు. ఇలా జగన్ అమలుచేస్తున్న బదిలీల తంత్రం ఆయా నియోజవకర్గాల్లో వికటించటం ప్రారంభమైంది.

మేయర్ చేసిన పనికి ఉద్యోగులు బలి!

ఆమె ఇంటికి తాయిలాల కోసం వెళ్లినందుకు జేసీ సీరియస్

సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



మేయర్ ఇంటి నుంచి గిఫ్టలతో వెళుతున్న ఉద్యోగులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా అధికారం అడ్డుపెట్టుకుని మేయర్ గంగాడ సుజాత పంచిన ఎన్నికల బహుమతులపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సీరియస్‌గా దృష్టిసారించారు. ఈ మేరకు సమావేశం పేరుతో మేయర్ ఇంటికి వెళ్లిన సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. 'మేయర్.. నిబంధనలు బేఖాతర్' కథనంపై జేసీ కార్పొరేషన్ అధికారులు, ఆర్డీఓలపై సీరియస్ అయ్యారు. వివరాల్లోకెళితే.. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని సీఈసీ ప్రకటించింది. అయితే ఆ తర్వాత మేయర్ కార్యాలయం నుంచి సచివాలయ కార్యదర్శులకు సమావేశం ఉందని సెల్‌ఫోన్‌లు మెస్సేజ్‌లు అందాయి. దీంతో మేయర్ నివాసానికి వెళ్లిన వారికి ఎన్నికల్లో బాగా పనిచేయాలని, వైసీపీ గెలుపు కోసం కృషిచేయాలని వస్త్రాలు, గిఫ్టులు ఇచ్చి మరీ కోరారు. నగరంలోని 70 సచివాలయాలలో పనిచేస్తున్న 700 మంది సెక్రటరీలు ఆ సమావేశానికి హాజరు కాగా, ఓ పదిమంది మాత్రమే ఆమె తీరును వ్యతిరేకిస్తూ బయటకు వచ్చేశారు. మిగిలిన సెక్రటరీలకు సీఎంతోపాటు, ఎమ్మెల్యే బాలినేని బొమ్మతో ముద్రించిన సంచులలో వస్త్రాలు, ఇతర విలువైన వస్తువులు బహుమతిగా ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతి శనివారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై జేసీ కార్పొరేషన్ కమిషనర్ జశ్వంతరావును, ఆర్డీఓ సుబ్బారెడ్డిని పిలిపించి సీరియస్ అయినట్లు సమాచారం. దీనిపై కమిషనర్ వారంతా సచివాలయ సెక్రటరీలు కాదని, వలంటీర్లు అని తప్పించుకునే ప్రయత్నం చేశారు. దీనిపై తన దగ్గర ఉన్న వీడియో, ఫొటోలను చూపి మరింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో కమిషనర్ హడావుడిగా ఓ ఏడుగురు సెక్రటరీల పేర్లు రాసి, షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం అయ్యారు.

మేయర్ చేసిన పనికి మేము బలి అయ్యాము

కోడ్ అమలులో ఉన్నప్పటికీ సమావేశం పేరుతో తమను మేయర్ ఇంటికి పిలిపించుకుని మరీ గిఫ్టులు ఇచ్చారు. అది కాక వలంటీర్లు, ఆర్పీలు, అంగన్‌వాడీలు ఇలా అందరికీ రూ.5వేలు ఇచ్చారట. వారిపై ఎలాంటి చర్యలు లేవు. కానీ మాకు మాత్రం వస్త్రాలు ఇచ్చి సరిపెట్టగా అవి తీసుకున్నందుకు మేం బలిపశువులం అయ్యాం అని పలువురు సెక్రటరీలు వాపోతున్నారు. మేయర్ సమావేశంతో తమకు ఒరిగిందేమీ లేదని, అధికారపార్టీ అని వెళితే తమను ఇలా బాధ్యులను చేయడం ఎంతవరకు సబబని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, తమను పిలిచిన మేయర్‌పై చర్యలు ఎందుకు తీసుకోరని పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. తమను సమావేశానికి వెళ్లాలని ఆదేశించిన సచివాలయ అడ్మిన్లు, కార్పొరేషన్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోరని సెక్రటరీలు సచివాలయాల్లో మాట్లాడుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

టీడీపీలోకి వలసల జోష్

ఉక్కిరిబిక్కిరవుతున్న అధికార పార్టీ

సీఎస్‌పురం, హనుమంతునిపాడు మండలాల్లో భారీ చేరికలు

డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీ ముఖ్యనేతలు చేరిక



సీఎస్‌పురంలో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కనిగిరి, మార్చి 18 : కనిగిరి నియోజకవర్గంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసల ప్రవాహం సాగుతోంది. గ్రామాలకు గ్రామాలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతుంటే ఆ సెగతో వైసీపీ నాయకత్వం ఉక్కిరిబిక్కిరవుతోంది. నియోజకవర్గంలో రెండు నెలలుగా ఆరుమండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు, నాయకులు, కార్యకర్తలతో సహా ఆయా పార్టీని వీడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో వేలాదిమంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. సోమవారం సీఎస్‌పురం, హనుమంతునిపాడు మండలాల్లో వైసీపీ ముఖ్యనేతలు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. సీఎస్‌పురంలో మండలంలోని వైసీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ, వైసీపీ మండల మాజీ కన్వీనర్ పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ మన్నేపల్లి రమణయ్యలతో పాటు 100మందికి పైగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా హనుమంతునిపాడు మండలంలోని కోటతిప్పల గ్రామంలో వైసీపీకి చెందిన 9కుటుంబాలు, రసీదుపురం గ్రామంలో 4కుటుంబాలు, తిమ్మారెడ్డిపల్లిలో 7కుటుంబాలు, మహ్మదాపురం గ్రామంలో 2 కుటుంబాలు, ముప్పాళ్ళపాడు గ్రామంలో 5కుటుంబాలు, కిష్టంపల్లి గ్రామానికి చెందిన 5 కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంతో పాటు టీడీపీ మినీ మేనిఫెస్టోతో పాటు కనిగిరి ప్రాంతాభివృద్ధికి తాను సంకల్పించిన 5 అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు.

తొలగింపు.. తలనొప్పి!

కోడ్ అమలులో ఉన్నా యథేచ్ఛగా ఉల్లంఘన

సచివాలయాల్లో అలాగే సీఎం బొమ్మలు

కార్పొరేషన్ అధికారులకు తప్పని తిప్పలు

ఇంకా నగరంలో బొమ్మలు, వైసీపీ రంగులు



ఒంగోలులో తొలగించని బాలినేని ఫ్లెక్సీ

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 18 : వైసీపీ నేతల ప్రచార పిచ్చి పాడుగాను. వాటిని తొలగించడానికి మున్సిపల్ సిబ్బంది నానా అగచాట్లు తప్పడం లేదు. ఒకటి కాదు.. రెండు కాదు ఐదేళ్లుగా శిలాఫలకం నుంచి, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రారంభోత్సవాలు, సచివాలయాలు, ఇలా ఒక టేమిటి ఖాళీగా ఏమి కనిపించినా పులిమేసిన వైసీపీ రంగులు ఇప్పుడు అధికారులకు తలనొప్పిగా మారాయి. ఈనెల 16వతేదీ నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బొమ్మలు, విగ్రహాలు కనిపించకుండా చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు. అయితే అవి ఇప్పుడు కార్పొరేషన్ అధికారులకు పెద్దపనిగా మారింది. సాధారణ విధులను సైతం వదిలేసి, గల్లీగల్లీ తిరిగి రాజకీయ రంగులు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించే పనిలో ఉన్నారు. ఒకటి రెండు అయితే ఎలాగోలా తొలగించొచ్చు. నగరంలో వైసీపీ ప్రచార పిచ్చితో ఇప్పుడు అధికారులు పదిరోజులు పనిచేసినా పూర్తిస్థాయిలో నియంత్రించే పరిస్థితి కనిపించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ఒకవైపు వెంటనే తొలగించకుంటే ఎన్నికల కమిషన్ చర్యలకు బలైపోతామని భయం, తొలగించడానికి సమయం సరిపోకపోవడం వెరసి అధికారులకు సంకటంగా మారింది. రెండురోజులుగా వారు నానా అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకించి ఇటీవల నగరంలో ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, ఏర్పాటు, అలాగే పలు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు ఏర్పాటుతోపాటు వాటికి, కార్యాలయాలకు వైసీపీ రంగులు పులిమేశారు. అంతేకాకుండా ఇటీవల నగరంలో వైసీపీకి ఓటు వేయాలంటూ పార్టీ నేతలు చెవిరెడ్డి, బాలినేనిల ఫొటోలతో వేలసంఖ్యలో పోస్టర్లు ముద్రించారు. వాటిని తొలగించడానికి నానా అవస్థలు. ఇదిలా ఉంచితే కొన్ని సచివాలయాలకు వైసీపీ రంగులు వేశారు. ఇప్పుడు వాటిని తొలగించాలంటే తెల్లరంగు వేయాల్సి ఉంది. అయితే ఆ భవనాలకు రంగులు వేయానికి ఏ నిధులు ఖర్చుచేయాలో అర్థం కాని పరిస్థితిల్లో అధికారులు తలపట్టుకు కూర్చున్నారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అటు అధికారపార్టీ నేతల ఆదేశాలతో అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితం అవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల కోడ్ అమలులోనూ వివక్షే




పీసీపల్లి బ్యాంకు సెంటర్లో ముసుగు లేకుండా వైఎస్సార్ విగ్రహం, బస్టాండు సెంటర్లో ముసుగుతో ఎన్టీఆర్ విగ్రహం




మాధవరంలో తొలగించని వైసీపీ జెండాలు, తూర్పుగంగవరంలో ట్యాంక్‌పై వైసీపీ నేతల పోస్టర్లు

పీసీపల్లి, మార్చి 18 : నిన్న మొన్నటి వరకు సంక్షేమ పథకాల అమలులో అర్హులను గుర్తించడంలో వివక్ష చూపిన కొంతమంది అధికారులు ఎన్నికల కోడ్ అమలులోనూ వివక్ష చూపుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రాజకీయ నాయకుల చిత్రాలను తొలగించడంతో పాటు విగ్రహాల మొహాలు కనిపించకుండా ముసుగువేయాలని ఆదేశాలు ఉన్నాయి. మండల అధికారులు అధికార పార్టీ వారి పట్ల ఒకరకంగా, ప్రతిపక్షం వారి పట్ల మరో రకంగా వ్యవహరిస్తున్నారు. పీసీపల్లిలో బస్టాండు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం, ఆ పక్కనే బ్యాంకు సెంటర్లో వైఎస్సార్ విగ్రహాలు ఉన్నాయి. కోడ్ అమలులో భాగంగా ఎన్టీఆర్ విగ్రహనికి వెంటనే ముసుగు తొడిగిన అధికారులు వైఎస్సార్ విగ్రహనికి మాత్రం ఎటువంటి ముసుగు వేయకుండా అలాగే వదిలేశారు. అటుగా వెళ్లే ప్రజలు ఈ రెండు విగ్రహాలను చూసి కోడ్ అమలుపరచడంలో ఇదేం వివక్ష అంటూ అధికారుల పక్షపాతాన్ని చర్చించుకుంటున్నారు.

తాళ్లూరు మండలంలోనూ యథేచ్ఛగా ఉల్లంఘన

తాళ్లూరు, మార్చి 18 : ఎన్నికల షెడ్యూల్ విడుదలై రెండు రోజులు కావస్తున్నా మండలంలోని పలుగ్రామాల్లో ఎన్నికల నియమావళిని గ్రామస్థాయి అధికారులు గాలికి వదిలివేశారు. ప్రతిపక్ష ఫ్లెక్సీలను, జెండాలను తొలగించిన పంచాయతీ కార్యదర్శులు వైసీపీకి చెందిన జెండాలు, ప్రచారగోడపత్రాలను అలాగే అట్టిపెట్టారు. మాధవరం గ్రామ ప్రధాన రహదారిలో రాములవారిగుడి వద్ద వైసీపీ జెండాలను తొలగించలేదు. మాధవరం, తూర్పుగంగవరం, లింగాలపాడు గ్రామాల్లో రోడ్ల వెంట భవనాలకు, వాటర్ ట్యాంక్‌లకు సీఎం జగన్, ఒంగోలు వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఫొటోలతో వేసిన ప్రచారగోడపత్రాలను అలానే ఉంచారు. ఎన్నికల కమిషన్ నియమావళిని తుచ పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా మండలంలోని అధికారులు తమకేమీ కాదన్నట్లు మిన్నకుంటుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల కోడ్‌కు తిలోదకాలు

- పలు గ్రామాలలో వైసీపీ ఫ్లెక్సీలు, బల్లలకు పార్టీ రంగులు
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, మార్చి 18: ఎన్నికల నియామవళిని కట్టుదిట్టంగా అమలుచేయాలని ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదలచేసి రెండు రోజులు గడుస్తున్నా పలుచోట్ల బేఖాతర్ చేస్తున్నారు. పలుచోట్ల కొంతమంది అధికారులు ఇంకా అధికార పార్టీ కనుసన్నల్లోనే ఉంటూ ఎన్నికల సంఘం ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవటం లేదు. పలు గ్రామాలలో శిలఫలకాలు, ఫెక్సీలు, విశ్రాంతి బల్లలను వైసీపీ నేతల పేర్లు, ఫొటోలతో గతంలో ఏర్పాటుచేశారు. వెంటనే వీటిని తొలగించాలని, ఎన్నికలలో వీటి ప్రభావం ఓటర్లపై ఉంటుందని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని గ్రామాల్లో అరకొరగా తొలగించగా, మరికొన్నిచోట్ల వైసీపీ నేతలను చూసి అధికారులు భయపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలు కూడా సచివాలయాల్లో ఇంకా ఉన్నాయి.

మండలంలోని కొణిదెనలో గ్రామ పంచాయతీ నిధులతో పెద్ద ఎత్తున వైసీపీ రంగులతో పాటు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటో, సర్పంచ్ తన్నీరు లేపాక్షి, అమె భర్త విష్ణు ఫొటోలతో పాటు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి పేర్లతో విశ్రాంతి బల్లలను ఏర్పాటుచేశారు. వీటిని ఎన్నికల నియమావళిలో భాగంగా తొలగించాల్సి ఉన్నా, అధికారులు పట్టించుకోవటం లేదు,

సాక్షాత్తు గ్రామ సచివాలయంలోనే బల్లలు ఉన్నా అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. గ్రామ కూడలిలో వైసీపీ ఫెక్సీ ఉన్నా తొలగించలేదు, ముక్తేశ్వరంలో రైతు భరోసా కేంద్రానికి వైసీపీ పోలిక ఉన్న రంగులు గతంలో వేశారు. ఎన్నికల నిబంధనల మేరకు వాటిని తొలగించాల్సి ఉన్నా అధికారులు మిన్నకుండి పోయారు. అలాగే, గ్రామాలలో వైసీపీ నేతల పేర్లతో ఉన్న శిలఫలకాలు కూడా దర్శనమిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చి 48 గంటలైనా గ్రామాలలో ఇంకా అధికారులు వైసీపీ నేతలు ఏర్పాటుచేసిన వాటి గురించి పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నోట్ పుస్తకాలపై కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు ఉన్నాయని, వాటిని ఎన్నికల సంఘం ఏమిచేస్తుందోనని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.





కొణిదెన గ్రామ సచివాలయంలో వైసీపీ రంగులు, ఫొటోలతో ఉన్న బల్ల, కొణిదెనలో తొలగించని వైసీపీ ఫెక్సీలు



ముక్తేశ్వరంలో రైతు భరోసా కేంద్రానికి తొలగించని వైసీపీ రంగులు

ఇవి పార్టీ రంగులు కాదా...

ఇంకొల్లు, మార్చి 18: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బహిరంగ ప్రదేశాలలో ఏ రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, కటౌట్లు, ప్రభుత్వ భవనాలకు పార్టీల రంగులు ఆదివారంలోగా తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అధికారులను అదేశించిన విషయం విధితమే. ఈమేరకు ఇంకొల్లు మండలంలో ఫ్లెక్సీలు తొలగించి, నాయకుల విగ్రహాలకు ముసుగులు కట్టారు. కొణికి గ్రామంలో పాతమద్రాసు రోడ్డు పక్కన ఓ ప్రభుత్వ కట్టడానికి వేసిన రంగులు అలాగే వదిలేశారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని నిర్మించి వైసీపీ రంగులు వేశారు. అది వాడుకలోకి రాలేదు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న ఈ షెడ్డు అధికారులకు కనిపించలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఇంకొల్లు: కొణికిలో ప్రభుత్వ షెడ్డుకు ఉన్న వైసీపీ రంగులు

ప్రారంభానికి నోచుకోని క్రీడా ప్రాంగణం

- చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో నిండిన వైనం
- ఎన్నికల పుణ్యమా అని వినియోగంలోకి
- నూతన హంగులతో ముస్తాబవుతున్న కేంద్రం



పర్చూరులో నిర్మించిన క్రీడా ప్రాంగణం

పర్చూరు, మార్చి 18: క్రీడాకారులకోసం రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన క్రీడా వికాస కేంద్రం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరింది. ముళ్ళ పొదలు, చిల్లచెట్లతో నిండిఉంది. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవటంతో అంధకారంలో అలానాపాలనకు నోచుకోక మూలనపడింది. ఈనేపథ్యంలో ఎన్నికల పుణ్యమా అని క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సమావేశాలు, సామగ్రి తదితర అంశాలకు సంబంధించి వినియోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రాంగణంతోపాటు చుట్టూ ఉన్న చిల్లచెట్లు, ముళ్ళపొదలను తొలగించటంతోపాటు, భవనం లోపల ఉన్న గదులతోపాటు, ప్రాంగణాన్ని శుభ్రంచేసేవిధంగా చర్యలు చేపడుతున్నారు.

పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అధర్యంలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులకు శిక్షణను అందించి జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు గత తెలుగుదేశం పార్టీ హయాంలో స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేతృత్వంలో రూ.2.5 కోట్ల వ్యయంతో ఎన్‌టీఆర్ క్రీడా వికాశం పేరుతో పర్చూరులో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అయితే, పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దశలో ప్రభుత్వం మారిపోయింది. అరకొర పనులు పూర్తిచేసి ప్రారంభించాల్సిన క్రీడా ప్రాంగణం గురించి నూతన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు పూర్తవుతున్న తరుణంలో కూడా ప్రారంభానికి నోచుకోలేదు. దీనిపై క్రీడాకారుల్లో విమర్శలు వెల్లువెత్తాయి.

మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయాలకు వెళ్లాను!

- వైసీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి హనిమిరెడ్డి

అద్దంకి, మార్చి 18: సీఎం జగన్మోహన్‌రెడ్డి వైసీపీ అద్దంకి నియోజకవర్గ అభ్యర్థిగా తన పేరును ప్రకటించటంతో కుటుంబసభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకునేందుకు దేవాలయాలకు వెళ్ళినట్లు పాణెం హనిమిరెడ్డి తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ తరఫున అద్దంకి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో అద్దంకిలో గెలిచి అసెంబ్లీలో అడుగుపెడతానని తెలిపారు. విలేకరుల సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు(కల్చరల్) మార్చి 18:ఎన్నికల సమయంలో భారత ఎన్నికల కమిషన్ విధించే నిబంధనలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని, నిబంధనల ప్రకారం పనిచేయకపోతే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు ఎన్నికల నిబంధనలపై ఆయన పలు సూచనలు చేశారు. సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేరయ్య మాట్లాడుతూ ఉద్యోగులు ఏ పార్టీ ప్రచారంలో పాల్గొనకూడదని, అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయంలో ప్రధాని, ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల చిత్రపటాలు ప్రదర్శించకూడదని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గ్రంథాలయానికి వచ్చే యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, కె.కృష్ణవేణి, ఎస్.అనిల్ బాబు, ఎం.శివకుమారి, లక్ష్మీ, జి.శాంసన్, వై.మృదుల్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీని వ్యతిరేకించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : కేంద్రంలోని మతోన్మాద బీజేపీని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశానికి కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు వ్యతిరేక చట్టాలను తెచ్చారని అన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు. 2019 మోటార్ వెహికల్ చట్టం, 2020 విద్యుత్‌చట్టం, హిట్ అండ్ రన్ చట్టం, ఉపాధి హామీ నిర్వీర్యం, సీఏఏ, ఎలక్టోరల్ బాండ్లు, ధరలు పెరుగుదల, ఫెడరల్ వ్యవస్థను నాశనం చేయడం తదితర విషయాలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలో కూడా కుట్రపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు.

సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎం. రమేష్, జి. శ్రీనివాసులు, జీవీ కొండారెడ్డి, బంకా సుబ్బారావు, జీవీ రాగయ్య, పీసీ కేశవరావు, ఈదర అన్నపూర్ణ, పారా శ్రీనివాసరావు, రంగారావు, రఫీ, టి. మహేష్, చిరంజీవి, అంజనేయులు, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

పర్చూరు, మార్చి 18: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పర్చూరు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పర్చూరులోని వైఆర్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన కేంద్రంలో 191 మంది విద్యార్థులకుగాను ముగ్గురు గైర్హాజరయ్యారు. ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో 241 మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరయ్యారు. ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 226 మందికిగాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారులు తెలిపారు. మండలంలోని అన్నంబొట్లవారిపాలెం హైస్కూల్‌లో 70 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరయ్యారు.

పంగులూరు: మండలంలోని రెండు కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పంగులూరు, ముప్పవరం కేంద్రంగా నిర్వహించబడుతున్న ఈ పరీక్షకు మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల నుంచి 341మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు హాల్‌టికెట్లు జారీ అయ్యాయి. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు రెండు కేంద్రాలలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముప్పవరం కేంద్రాన్ని ఎంఈవో వీరాంజనేయులు పర్యవేక్షించారు. ఎస్ఐ తిరుపతిరావు కేంద్రాల వద్ద ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.

అద్దంకిటౌన్: అద్దంకిలో నిర్వహిస్తున్న పదో తరగతి ఆరు పరీక్ష కేంద్రాల్లో 1059 విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో బి.సుధాకరరావు తెలిపారు. మొత్తం 1071 మంది విద్యార్థులకుగాను 12 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

ఇంకొల్లు: మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలలో సోమవారం 801 మం విద్యార్థులు పరీక్ష రాసినట్లు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. 820 మంది విద్యార్థులకుగాను 19 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

బల్లికురవ: బల్లికురవ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో సోమవారం జరిగిన పదో తరగతి తెలుగు పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 581 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసేందుకు ఫీజు చెల్లించారు. ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్‌లు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.



పర్చూరులో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు

మార్టూరు: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మార్టూరులో మూడు పరీక్షా కేంద్రాలు, వలపర్ల, ద్రోణాదుల కేంద్రాల్లో 1073 మంది విద్యార్థులకుగాను పది మంది గైర్హాజరైనట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు.

చినగంజాం: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పరీక్షకు 259 మంది విద్యార్థులకుగాను 16 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎ.వెంకటసుబ్బారావు తెలిపారు. కడవకుదురు జడ్పీ పాఠశాలలో 174 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ హేమంతకుమార్ తెలిపారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలో పదో తరగతి పరీక్షలు మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. మేదరమెట్ల, రావినూతల జడ్పీహెచ్ఎస్, సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తం 458 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షకు నలుగురు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

కూటమి విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, మార్చి 18: రానున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి మండలంలోని గుంటుపల్లి అసిస్టు కాలనీలో టీడీపీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడింది టీడీపీనేనని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్ల పాలనలో అన్నివర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సామాన్యులు జీవించే పరిస్థితి లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు నెలవారీగా వేలల్లో బాదుతున్నారన్నారు. అన్ని రాష్ట్రాలలో కల్లా ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్ డీజిల్, మద్యం ధరలు అత్యధికమని అన్నారు. నిరుపేదలను ప్రభుత్వం దోచుకుంటుందని ఆయన విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనను అంతమొందించేలా టీడీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి పార్టీ పూర్వవైభవానికి కృషి చేయాలన్నారు. కూటమి ఘన విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రధానమంత్రి మోదీ పాల్గొన్న ప్రజాగళం సభను చూసి వైసీపీలో వణుకు మొదలైందన్నారు. అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలకు ప్రజలే చుక్కలు చూపిస్తారని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, పుచ్చకాయల సుబ్బరామయ్య, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



గుంటుపల్లిలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన గొట్టిపాటి

బల్లికురవ, మార్చి 18: మండలంలోని అంబడిపూడి ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త మట్టుపల్లి అంజయ్య ఇటీవల మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీపరంగా ఆదుకుంటామని చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు మందలపు సుధాకర్, దద్దాల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపడం ఖాయం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 18: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి పట్టం కట్టడానికి ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. ఆదివారం బొప్పూడి వద్ద జరిగిన ప్రజాగళం భారీ సభ విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని సోమవారం మార్టూరు మండలం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ఏలూరి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందనడానికి ప్రజాగళంకు భారీగా హాజరయిన ప్రజానీకమే నిదర్శనమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను తనఖా పెట్టిన జగన్ ప్రభుత్వానికి వీడ్కోలు పలకడానికి మేం సిద్ధం అంటూ ప్రజాగళానికి భారీగా ప్రజానీకం హాజరై చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించాలని రాష్ట్ర ప్రజానీకం నిర్ణయించుకున్నారని చెప్పారు. జగన్ రాష్ట్రం నుంచి పారిపోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అభివృద్ధిలో పోటీ పడాల్సిన ఆంధ్రప్రదేశ్‌ను అధోగతి పాలుచేసిన మంత్రులు అవినీతిలో పోటీ పడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తిచేయగా అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అడ్డుకున్నదన్నారు. కనీసం రెండు శాతం పనులు కూడా చేయని జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాబోతున్నాయన్నారు. అవినీతి రహిత స్వచ్ఛమైన పాలనను అందించే ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడబోతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.



బొప్పూడి సభ వద్ద ప్రధానమంత్రి మోదీతో ఎమ్మెల్యే ఏలూరి

మూల్యాంకనానికి గైర్హాజరైన 74మందికి తాఖీదులు

ఒంగోలు(విద్య), మార్చి 18 :ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, గణితం, పౌరశాస్త్రం జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. మూల్యాంకనానికి ఇంటర్మీడియేట్ విద్యా మండలి 405 మంది అధ్యాపకులను నియమించింది. వీరిలో 331 మంది అధ్యాపకులు విధులకు హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐవో సైమన్ విక్టర్ పత్రికా ప్రకటనా ద్వారా హెచ్చరికలు జారీ చేసినా అధ్యాపకులు పట్టించుకోలేదు. దీంతో వీరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్ఐవో ఈ 74 మందికి నోటీసులు జారీ చేశారు. గైర్హాజరైన అధ్యాపకులు రోజుకు వెయ్యి రూపాయాలు అపరాధ రుసుంగా బోర్డుకు చెల్లించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులైతే సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులే అపరాధ రుసుం చెల్లించాలి. విధులకు హాజరు కాని అధ్యాపకులు పనిచేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి కళాశాల గుర్తింపును బోర్డు రద్దు చేస్తుందని ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్స్ ఆ అధ్యాపకులను రిలీవ్ చేసి మూల్యాంకన విధులకు పంపించాలని ఆయన కోరారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠినచర్యలు



అనంతవరంలో కేంద్ర బలగాలలో యద్దనపూడి పోలీసుల కవాతు

యద్దనపూడి(మార్టూరు), మార్చి 18: ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని, గొడవలు, అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని యద్దనపూడి ఎస్ఐ జీవీ చౌదరి అన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తగా సోమవారం సాయంత్రం యద్దనపూడి మండలంలోని అనంతవరం, సూరవరపుపల్లె గ్రామాలలో కేంద్ర బలగాలతో యద్దనపూడి పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామాలలో ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బిశ్రీనివాసరావు, కేంద్ర బలగాలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీకి సహకరించాలి

వేటపాలెం(చీరాల), మార్చి 18: మండల పరిధిలోని పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, జబ్బార్ కాలనీ, దేశాయిపేటలలో టీడీపీ నాయకుడు తిరువీధుల శ్రీనివాసరావు సోమవారం పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి సహరించాలని ఆయా ప్రాంతాల్లో పెద్దలను, ప్రజలను కోరారు.

బ్రహ్మయ్యకు టీడీపీ నేతల నివాళి

ఇంకొల్లు, మార్చి 18: మండలంలోని హనుమోజిపాలెంకు చెందిన మాజీ సర్పంచ్ అరె బ్రహ్మయ్యకు స్థానిక టీడీపీ నాయకులు నివాళులర్పించారు. బ్రహ్మయ్య ఇటీవల మృతి చెందారు. సోమవారం దశదినకర్మకు నాయకులు హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, మార్క్, సాంబయ్య, బోడావుల శివయ్య, తాతయ్య, స్థానిక నాయకులు ఉన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్లో కుటుంబసభ్యులను పరామర్శించారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మార్టూరు, మార్చి 18: జాతీయ రహదారిపై ఒంగోలు వైపు వెళుతున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. సోమవారం మధ్యాహ్నం అమరావతి నూలు మిల్లు ఎదురుగా జరిగిన ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న యజమాని గుప్తా హరిబాబు క్షేమంగా బయటపడ్డారు. అద్దంకికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ హరిబాబు కారులో వ్యక్తిగత పనులు నిమిత్తం చిలకలూరిపేట వెళ్లి వస్తున్నారు. ఈక్రమంలో ముందువెళుతున్న వాహనం సడన్‌గా రోడ్డుకు అడ్డంగా రాగా, దానిని తప్పించడానికి సడన్ బ్రేక్ వేయగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని గుంటూరువైపు వెళ్లే రోడ్డులోకి వచ్చి బోల్తాపడింది. సమీపంలో ఉన్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కారు అద్దాలు పగులగొట్టి హరిబాబును క్షేమంగా బయటకుతీశారు. ఈసమయంలో హైవేలో ఎలాంటి వాహనాలు, ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

హుండీల కానుకల లెక్కింపు

అద్దంకి, మార్చి 18: మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో హుండీల కానుకలను సోమవారం లెక్కించారు. 9 నెలల కాలానికి లక్షా 30 వేల 37 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణారెడ్డి తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది ఎక్కువ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు నడింపల్లి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఈదా శ్రీనివాసరెడ్డి, అనమనమూరు సర్పంచ్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారసామగ్రి ముద్రణలో మార్గదర్శకాలు పాటించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉన్నందున ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లు, బ్యానర్లు తదితర ప్రచార సామగ్రి ముద్రించే సమయంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లాలోని ప్రింటర్స్ యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లు, బ్యానర్లు తదితర సామగ్రిని ముద్రించే సమయంలో ప్రింటర్స్ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రిప్రజంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ సెక్షన్ 127 ఎ ప్రకారం ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించే సమయంలో తప్పని సరిగా సంబంధించిన ప్రింటర్, పబ్లిషర్ పేర్లు, చిరునామాలు లేకుండా కరపత్రాలు, పోస్టర్లను ముద్రించరాదన్నారు.

ఏ ప్రింటర్ అయినా నిబంధనలకు అతిక్రమిస్తే ప్రింటింగ్ ప్రెస్ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రింటర్లు ముద్రించే సంస్థలు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అపెండెక్స్-ఎ, అపెండెక్స్-బి ప్రొఫార్మాలో డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించిన తర్వాత మూడు రోజుల్లో ముద్రణకు సంబంధించిన వివరాలను ఎన్నికల విభాగానికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లారెవెన్యూ అధికారి శ్రీలత, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, సెక్రటరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్

ఒంగోలు(విద్య), మార్చి 18 : జాతీయ ఉపకార వేతనం నేషనల్ మాథ్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైన విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాకు తప్పని సరిగా ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఒక ప్రకటనలో కోరారు. 2019, 2020, 2021,2022 సంవత్సరాలలో ఈ స్కాలర్ షిప్‌నకు ఎంపికై ప్రస్తుతం 9నుంచి ఇంటర్మీడియేట్ చదువుతున్న వారు తప్పకుండా తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్‌ను జత చేయించుకోవాలని కోరారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

మద్దిపాడు, మార్చి 18: మోటర్‌బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మద్దిపాడు ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల మేరకు చిత్తూరు జిల్లాకు చెందిన జగదీష్ గత కొన్నేళ్లుగా మద్దిపాడు పరిసర ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్దిపాడు నుంచి ఒంగోలు వెళ్లేక్రమంలో జగదీష్ నడుపుతున్న మోటర్‌బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో జగదీష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మద్దిపాడ ఎస్సై తెలిపారు.


డబ్బు అక్రమ తరలింపును కట్టడి చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 18 : జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, అక్రమంగా డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు మరింత సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల ద్వారా జరిగే లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలు ఏమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇప్పటికే జిల్లాలోని అన్ని బ్యాంకులను ఈఎస్ఎంఎస్ యాప్‌లో అనుసంధానం చేశామన్నారు. ప్రధాన బ్యాంకు నుంచి శాఖలకు, ఏటీఎంలకు నిధులను తరలిస్తున్నట్లయితే అందుకు సంబంధించిన వివరాలను స్పష్టంగా బాక్స్‌లపైనా ప్రస్తావించడంతో పాటు పూర్తి వివరాను క్యూఆర్ కోడ్ రూపంలో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, ఈఎస్ఎంఎస్ సాంకేతిక పరిశీలకులు భరద్వాజ్ ఉన్నారు.

వాణిజ్య వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు తొలిగించండి

ఒంగోలుక్రైం, మార్చి18: వాణిజ్య వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు , స్లోగన్లు ,స్టిక్కర్లు తొలింగించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలా తొలిగించకుండా పట్టుబడితే ఎన్నికలు అయిపోయే వరకు వాహనాలు రిలీజ్ చేయమని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.





బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న చలువ పందిళ్లు



నేటి నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

బిలకూట క్షేత్రంలో పూర్తయిన ఏర్పాట్లు

బిట్రగుంట, మార్చి 18: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారం గిరిప్రదక్షిణతో ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి గోమాత సమేతంగా బిలకూట క్షేత్రం చుట్టూ ప్రదక్షిణ నిర్వహిస్తారు. రాత్రి అంకురార్పణ, 20న ఉదయం తిరుమంజనం, రాత్రి ధ్వజారోహణ, కొడిముద్దలు, అనంతరం స్వామివారికి శేషవాహనసేవ నిర్వహిస్తారు. 21న ఉదయ కాల పూజలు, హోమాలు, రాత్రి హనుమంతసేవ, 22న ఉదయం మోహిని ఉత్సవం, రాత్రి గరుడసేవ, 23న ఉదయం మొక్కుబడులు, మెట్లపూజ, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రి గజవాహనసేవ జరుగుతుంది. 24న ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్రం చక్రస్నానం, రాత్రి అలకలతోపు, అశ్వవాహనసేవ, ధ్వజావరోహనం ఉంటుంది. 25న సాయంత్రం పుష్పయాగం, రాత్రి ఏకాంతసేవ నిర్వహిస్తారు.

● విస్తృత ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రసన్నుడి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, దేవతామూర్తుల కటౌట్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రాధాకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్వామివారి కళ్యాణ ఆహ్వాన పిలుపుల్లో ఆలయ సిబ్బంది పరుగులు పెడుతున్నారు. ఏడాదికి ఒక్కసారి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలంటే గ్రామస్థులు పెద్ద పండువలా భావిస్తారు. ఇళ్లను రంగులు, పచ్చని తోరణాలతో అలంకరిస్తారు. బంధుమిత్రులకు ఆహ్వానం పలుకుతారు.

● హుండీ లెక్కింపు

ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. గడిచిన రెండు నెలల కాలంలో హుండీల ద్వారా రూ.10,19741 ఆదాయం లభించినట్లు ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం) : 6.24
సహరి (బుధవారం) : 4.53

గ్రామదారికి రిజిస్టర్ చేసి
కబ్జా యత్నం

● అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు

ఏఎస్ పేట, మార్చి 18 : నాయకుల అండ, అధికారుల సహకారం ఉంటే ప్రభుత్వ పొలాలు, ఖాళీ స్థలాలే కాదు గ్రామదారులనూ కబ్జాదారులు స్వాహా చేస్తున్నారు. ఏఎస్ పేట మండలంలోని తెల్లపాడు గ్రామంలో సోమవారం ఉదయం రెవెన్యూ అధికారులు రామాలయం వెనుక ఉన్న రెండో వీధిలో కొలతలు తీయడం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి కొలతలు తీస్తున్నారని గ్రామస్థులు అనుకున్నారు. కానీ ఆ స్థలం గ్రామనికి చెందిన వళ్లెం వెంగమ్మకు చెందినదని, ఆమెకు రిజిస్టర్ కూడా ఉండడంతో సర్వే చేయడానికి విచ్చేశారని తెలుసుకొని అవాక్కయ్యారు. వెంటనే గ్రామస్థులు నిలదీయడంతో అధికారులు వెనుతిరిగారు. అయితే, సాయంత్రం మళ్లీ అధికారులు రావడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు అధికారులు అక్కడ నుంచి జారుకున్నారు.



రంగడి తిరునాళ్ల
రేపటి నుంచి ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 18 : దేశంలోని పురాతన ఆలయాల్లో ఒక్కటైన నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. పెన్నా నది ఒడ్డున ఉన్న ఈ ఆలయంలో స్వామివారు శయనమూర్తిగా భక్తులకు దర్శనమిస్తారు. కాగా, 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 21న శేష వాహనం, 22న సూర్యప్రభ, చంద్రప్రభ, 23న సింహవాహనం, 24న హనుమంతసేవ, 25న బంగారు గరుడ సేవ, 26న కల్యాణం, గజవాహనసేవ, 27న రథోత్సవం, 31న తెప్పోత్సవాలు జరుగుతాయి.

వసతులు లేక ఇబ్బందులు

జిల్లాలో పలు పరీక్ష కేంద్రాల్లో కనీస నదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వసతుల కల్పనలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారంటూ పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఫ్యాన్లు కూడా లేని గదుల్లో పరీక్షలు ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా మంచినీటి వసతులు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు తొలిరోజే అగ్నిపరీక్షను ఎదుర్కొన్నారు. జిల్లాలో అత్యధిక కేంద్రాల్లో మంచినీటి వసతులు లేకపోవడం, ఉన్న వాటర్ ప్లాంట్లన్నీ మూలనపడడంతో విద్యార్థులకు నీరు అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమస్య ఉందని ముందస్తుగా తెలుసుకున్న విద్యార్థులు ఇళ్ల నుంచే సీసాలతో నీళ్లు తెచ్చుకున్నారు. అలాగే మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు, ఇంకొన్ని చోట్ల వెలుతురు సరిగా లేక చీకట్లోనే పరీక్ష రాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు సమయానికి కేంద్రానికి చేరుకునే క్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. మొత్తం మీద తొలిరోజే సమస్యల నడుమ టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి.



ఇక్కడే ఉంటాం.. ధైర్యంగా రాయండి : నెల్లూరులో ఓ పరీక్ష కేంద్రం వద్ద పిల్లలతో తల్లిదండ్రుల సందడి

ఉక్కపోత.. మంచినీటి కొరత!

తొలిరోజే పది విద్యార్థులకు అగ్ని పరీక్ష
కేంద్రాల్లో సౌకర్యాలు లేక అవస్థలు



సరస్వతీ నమస్తుభ్యం : పరీక్షకు ముందు అమ్మవారి ప్రార్థన

నెల్లూరు (విద్య), మార్చి 18 : జిల్లావ్యాప్తంగా 176 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు టెన్త్ పరీక్ష జరిగింది. తొలిరోజు తెలుగు పరీక్షకు 28,057 మంది హాజరవగా, 1,282 మంది (95.63 శాతం) గైర్హాజరు అయ్యారు. 7 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్న పత్రాలను 45 స్టోరేజీ పాయింట్లలో భద్రపరిచి అరగంట ముందు ఆయా కేంద్రాలక తరలించారు. 2,300 మంది ఇన్విజిలేటర్లతో పాటు 176 మంది సీఎస్‌లు, 176 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 25 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పాఠశాలల పరిసర ప్రాంతాల్లోని జెరాక్స్ సెంటర్‌లను మూసివేశారు. అలాగే పరీక్షా సమయానికంటే గంట ముందుగా కేంద్రానికి హాజరు కావాలని అధికారులు సూచించినా కొన్ని ప్రాంతాల్లో రవాణా, ట్రాఫిక్ సమస్యల కారణంగా కొంతమంది విద్యార్థులు కొంత ఆలస్యంగా హాజరైనా కూడా అధికారులు అనుమతించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వారి హాల్‌టికెట్లను, తమకు కేటాయించిన గదులను బోర్డులలో పరిశీలించుకుంటూ హడావుడిగా కనిపించారు.



జాగ్రత్తసుమా ! : సీతారామపురంలో విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయురాలు



టైం అయిపోతోంది..



అన్నీ ఉన్నాయిగా.. : కేంద్రంలో పరిశీలన



లింగసముద్రం : తండ్రి సాయంతో వస్తున్న దివ్యాంగుడు

● ఓపెన్ స్కూల్ పరీక్షలకు..

జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు 4,658 మంది అభ్యాసకులు హాజరయ్యారు. పదోతరగతికి 11 సెంటర్‌లు, ఇంటర్‌కు 19 సెంటర్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షల్లో టెన్త్‌కు 1524 మంది హాజరవగా 122 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్‌కు 3134 మంది హాజరవగా 186 మంది గైర్హాజరయ్యారు. 13 పరీక్ష కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియచేయాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అసదుల్లా ఖాన్ తెలిపారు.

కేంద్రాల పరిశీలన

జిల్లాలో పదోతరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. విద్యాశాఖ జేడీ, జిల్లా పరిశీలకుడు మువ్వా రామలింగం, డీఈఓ పీవీజేవీ.రామారావు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆయా కేంద్రాలను పరిశీలించారు. వసతులు సరిగా లేని ప్రాంతాల్లో వెంటనే వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న పరీక్షలకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రాల వద్ద ఉన్న తల్లిదండ్రులకు తెలియచేశారు. ఏదైనా సమస్యలు ఉంటే 8341408109 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?: నెల్లూరులోని పరీక్ష కేంద్రంలో వసతులపై తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం



దిష్టంతా పోవాలి.. వరికుంటపాడులో విద్యార్థులకు దిష్టితీస్తున్న బీజేపీ నాయకులు

పరస్పర సమన్వయంతోనే ప్రశాంత ఎన్నికలు!

కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 18 : జిల్లా అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీల నాయకుల పరస్పర సమన్వయంతోనే ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సాధ్యమవుతుందని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సహకరించాలని కోరారు. నామినేషన్ల పత్రాలు, అఫిడవిట్‌లో తప్పులు లేకుండా సమర్పించడం, కొత్త బ్యాంకు కొత్త ప్రారంభించడం, అభ్యర్థుల ఖర్చుల వివరాలు, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లింపు, వాహనాలు, సమావేశాలు, సభలు, ర్యాలీలకు అనుమతులు తదితరాలకు సంబంధించిన నిబంధనలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఏప్రిల్ 18న ఫామ్-1 విడుదల చేస్తూ ఏ ఏ ప్రాంతాలలో నామినేషన్లు స్వీకరిస్తామో తెలియచేస్తామన్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి రూ.25వేలు, అసెంబ్లీకి రూ.10వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రిటర్నింగ్ అధికారులు వీరే!

నెల్లూరు పార్లమెంటుకు తాను (కలెక్టర్) రిటర్నింగ్ అధికారిగా ఉంటానన్నారు. కందుకూరుకు నియోజకవర్గానికి సబ్ కలెక్టర్, కావలి, ఆత్మకూరులకు ఆర్డీఓలు, కోవూరుకు జాయింట్ కలెక్టర్, నెల్లూరు సిటీకి కార్పొరేషన్ కమిషనర్, నెల్లూరు రూరల్‌కు నెల్లూరు ఆర్డీఓ, సర్వేపల్లికి తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్, ఉదయగిరికి ఆత్మకూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వెంకటగిరికి తిరుపతి సబ్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, సమాచారశాఖ డీడీ సదారావు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

● డీఆర్‌డీఏలో మీడియా విభాగం

కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) విభాగాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఈ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనల కోసం ఎంసీఎంసీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

కమాండ్ కంట్రోల్ పటిష్టంగా ఉండాలి

నెల్లూరు(హరనాథపురం); మార్చి 18 : నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ కార్యకలాపాలను పటిష్టం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. సోమవారం ఆ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, స్వీప్ కార్యక్రమాలు, యంత్రాంగం చేపడుతున్న కార్యకలాపాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వికాస్ మర్మత్, తదితరులు పాల్గొన్నారు

'అధికార' దాసోహం!

● వైసీపీ నేతల ప్రచారాల్లో ఉద్యోగులు
● ఇంటింటా తిరుగుతున్న 'ఉపాధి' సిబ్బంది, వీఆర్వోలు, వలంటీర్లు

ఈ చిత్రాల్లో వృత్తాకారంలో ఉన్న వారంతా ప్రభుత్వ ఉద్యోగులే.

సార్వత్రిక ఎన్నికల కోడ్ కూసినా అధికార పార్టీ నేతల సేవలో వారంతా తరిస్తున్నారు. నాయకులతో ప్రచారంలో పాల్గొంటూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. వరికుంటపాడులో వైసీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి విజయ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం రాత్రి జరిగిన ప్రచారంలో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు చిందులేస్తూ జేజేలు పలుకుతూ తమ వీరాభిమానాన్ని చాటుకొన్నారు. తూర్పు కొండారెడ్డిపల్లి, నార్త్‌కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు కాంచెరువుకు చెందిన ఎండీయూ వాహన ఆపరేటర్ నాయకుల వెంట నడుస్తూ తమ స్వామిభక్తిని చాటుకున్నారు.

● చేజర్ల మండలం పాడేరు గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి 'విజయీభవ' యాత్రలో వీఆర్వో లక్ష్మీప్రసాద్, వలంటీరు పవన్ పాల్గొనడం చర్చనీయాంశమైంది.

● బుచ్చిరెడ్డిపాళెంలోని ఇస్కపాలెం సచివాలయం పరిధిలో వలంటీర్లు అధికార పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం విమర్శలకు తావిచ్చింది. ఛైర్‌పర్సన్ సుప్రజ, ఇతర నాయకులతో కలిసి ప్రచారం చేసినా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడంపై ప్రజల్లో విమర్శలకు తావిచ్చింది.

- వరికుంటపాడు/చేజర్ల/బుచ్చిరెడ్డిపాళెం



బుచ్చిలో అధికార పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న వలంటీర్లు (వృత్తంలో ఉన్నవారు)





చేజర్ల : విజయీభవ యాత్రలో విక్రమ్‌రెడ్డికి పక్కనే వలంటీరు, వీఆర్వో





వరికుంటపాడు : మేకపాటి ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఈయన ఎండీయూ వాహన ఆపరేటర్

ప్రశాంతంగా పది పరీక్షలు


లింగసముద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయురాలు

లింగసముద్రం, మార్చి 18: స్థానిక కేఆర్ జెడ్పీ హైస్కూల్, పెదపవని భోరావు హైస్కూల్‌లో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. లింగసముద్రం పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ అధికారి హనుమంతరావు తనిఖీ చేశారు. పెదపవనిలోని పరీక్ష కేంద్రాన్ని గుడ్లూరు సీఐ జీ.సుబ్బారావు, లింగసముద్రం ఎస్సై ఎం బాజీబాబు, ఎంఈవో-2 శివకుమార్ తనిఖీ చేశారు. లింగసముద్రం కేంద్రంలో దివ్యాంగ విద్యార్థి సహాయకుడిగా దత్తు వరుణ్‌కుమార్ వ్యవహ రించాడు.

కలిగిరి: ఉన్నత పాఠశాలలో 162మందికి 154మంది హాజరయ్యారు. చీఫ్‌గా ఎస్ భీమే శ్వర, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ప్రభాకరరెడ్డి వ్యవహరించారు. ఏపీ మోడల్‌స్కూల్‌లో 201మందిలో 186మంది రాశారు. చీఫ్‌గా లక్ష్మీరెడ్డి, ఉన్నారు.

కొండాపురం: తెలుగు పరీక్షకు 20మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. గరిమెన పెంట, గొట్టిగుండాల ఉన్నతపాఠశాల విద్యార్థులు వింజమూరు పరీక్ష కేంద్రంలో పరీక్ష రాశారు.

వింత్రగుంట : కప్పరాళ్లతిప్పలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల, విశ్వనాథరావుపేట బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లో 472మందికి 442 మంది హాజరయ్యారు.

ఆత్మకూరు, మార్చి 18: పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో 777 మంది విద్యార్థుల్లో 749 మంది హాజరయ్యారు. సెయింట్ మేరీస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 201 మంది విద్యార్థులకు 194 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 204 మందికి 199 మంది వచ్చారు. బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 143మందిలో 137మంది విద్యార్థులు పరీక్ష రాశారు. శ్రీనివాస ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో 105మందికి 99మంది, జూనియర్ కాలేజీలో 124మందిలో 120 మంది హాజరయ్యారు. కేంద్రాలను ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు.

చేజర్ల: స్థానిక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాల కేంద్రాలలో 405 మంది విద్యార్థులకు 380మంది హాజరయ్యారు. కేంద్రాలను తహసీల్దార్ కేగోపికృష్ణ, ఎంపీడీవో కరీముల్లా పరిశీలించారు.

సంగం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 9-30గంటలకు పరీక్ష ప్రారంభమవగా అరగంట ముందుగానే పోలీసులు, పాఠశాలల సిబ్బంది విద్యార్థుల హాల్ టిక్కెట్‌లను పరిశీలించి పరీక్ష హాలులోనికి అనుమతించారు. గురుకులంలో 190మందిలో 7గురు గైర్హాజరయ్యారు. జెడ్పీహెచ్ఎస్‌లో 175మందిలో 7గురు హాజరుకాలేదు. తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో జానికీరామయ్య తెలిపారు.

సీతారామపురం: హైస్కూల్ కేంద్రంలో 137 మందికి 120మంది, ఆదర్శపాఠశాల కేంద్రంలో 175మందిలో 157మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి శ్రీనివాసులు తెలిపారు.


కలిగిరి : పరీక్ష గదిలో విద్యార్థులు

వరికుంటపాడు: స్థానిక ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 141మంది విద్యార్థుల్లో 139మంది హాజరయ్యారు. బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంద్రా పరంధామిరెడ్డి పరీక్షా కేంద్రం ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులకు టెంకాయతో దిష్టి తీసి పరీక్షలు రాయాలని ఆశీర్వదించి పంపారు.

ఉదయగిరి రూరల్: స్థానిక ఉన్నత, సెయింట్ మేరీష్, గండిపాళెం జిల్లా పరిషత్, గురుకుల పాఠశాలల్లో 520మంది విద్యార్థుల్లో 17మంది గైర్హాజరయ్యారు.

ఏఎస్ పేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 111మందిలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజర య్యారు. మోడల్‌స్కూల్‌లో 148 మంది విద్యార్థుల్లో ఇద్దరు హాజరుకాలేదు. కేంద్రాల వద్ద విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని సౌకార్యలు కల్పించారు.


ఆత్మకూరు: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు


సంగంలో హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న పోలీసులు

టీడీపీలోకి కండ్రిక సర్పంచి


ఆనం సమక్షంలో
టీడీపీలో చేరిన కండ్రిక సర్పంచి, గ్రామస్థులు

మర్రిపాడు, మార్చి 18: కండ్రిక సర్పంచ్ గుర్రం మాధవి సోమవారం తన భర్త తిరుపాలుతో పాటు మాదాల కృష్ణయ్య, పోలిమేర మస్తాన్‌రెడ్డి, మేకపాటి వెంకటే శ్వర్లు, మూలి రమణారెడితో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నెల్లూరులోని మాజీ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి నివాసంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆనం వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధి ఆనంతోనే సాధ్యమని, ఆయన గెలుపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

రెండు మృతదేహాలకు పోస్టుమార్టం

సంగం, మార్చి 18: రెండు ప్రమాదాల్లోని మృతదేహాలకు సోమవారం పోలీసులు పోస్టుమార్టం చేయించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ అనాథ మృతచెందగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆత్మకూరు మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించారు. వారు మృతదేహాన్ని ఖననం చేశారు. అదేవిధంగా దువ్వూరు కాలువ నీటిలో పడి మృతి చెందిన సూరాయపాలెం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

రేపు పరిచయ కార్యక్రమం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలకేంద్రంలోని భారత్ పెట్రోల్‌బంకు ఆవరణలో బుధవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌తో పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ పేలహుడి వెంకటరత్నం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పాల్గొంటారన్నారు. ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, మార్చి 18: పట్టణంలోని 18వ వార్డులో లక్ష్మమ్మ, పరంధామయ్య 5వ వార్డులో గురువయ్య, 10వ వార్డులో శంకరరెడ్డిలు కొన్నిరోజుల కిందట వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి వారి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.40వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారుడి ఫిర్యాదుపై విచారణ

వింజమూరు: స్థానిక శుభోదయం గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు డోర్ డెలివరీకి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారని వైశ్య బజార్‌కి చెందిన కొండ మల్లి కార్జున్ అనే వినియోగదారుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం ఆర్ఐ మీరా బాషా గ్రామంలో విచారణ చేపట్టారు. గ్యాస్ ప్రస్తుతం ధర రూ.870 అయితే రూ.900 వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు విచారణ చేసి ఉన్నతా అధికారులకు నివేదిక పంపుతుతామన్నారు.


ఫిర్యాదుపై విచారణ చేస్తున్న అధికారులు

మూలకు చేరిన పారిశుధ్య యంత్రాలు

సీతారామపురం, మార్చి 18: తొమ్మిది సచివాల యాలకు జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసి ఫాగింగ్ యంత్రం, హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్, రుతురుమాళ్ల దహనం, పిచ్చిమొక్కలు తొలగించే పరికరాలను కొనుగోలు చేశారు. ప్రస్తుతం వాటిని వినియోగించక పోవడంతో అవి కార్యాలయంలో మూలకు పరిమితమై తుప్పు పడుతున్నాయి. వీటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడం.. పరికరాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించక పోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని సచివాలయాల సిబ్బందే పెదవి విరుస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరికరాలు సక్రమంగా వినియో గించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సీతారామపురంలో
నిరుపయోగంగా ఉన్న యంత్రాలు

పోరాటంలో మాదిగ యువత భాగస్వామ్యం కావాలి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): ఎస్సీ వర్గీకరణ కోసం చేసే పోరాటంలో మాదిగ యువత భాగస్వామ్యం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఒంగోలు వెళుతున్న ఆయన్ను సోమవారం దుత్తలూరులో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఎంఎస్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ ఆంకాంక్షను నెరవేర్చేందుకు రిజర్వేషన్ల కోటాలో న్యాయమైన వాటా కోసం పోరాటం చేయాలన్నారు. రాజకీయాలు, జెండాలకతీతంగా జాతి యావత్తును సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అందరితో చర్చించి పోరాటాన్ని వేగవంతం చేయాలన్నారు. అలాగే వికలాంగుల ఫింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, పందిటి అంబేద్కర్, గోచిపాతల వెంకటేశ్వర్లు, గంగపట్ల సింహాద్రి, బర్రె అర్జున్ పాల్గొన్నారు.


మంద కృష్ణమాదిగను కలిసిన
ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు

గురజాల వాసునాయుడుకి పరామర్శ


వింజమూరు, మార్చి 18: పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు గురజాల వాసునాయుడు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఉదయగిరి తెలుగుదేశం జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ వింజమూరులోని గురజాల వాసు నివాసానికి వెళ్లి పరామర్శించాడు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాకర్ల సురేష్ వెంట పార్టీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, గురజాల సుబ్బారావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, మల్లినేని రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసులు, గంగపట్ల హజరత్ ఉన్నారు.


వాసునాయుడుని పరామర్శిస్తున్న కాకర్ల

ఇళ్ల పైనుంచే వెళ్లిన 33/11 కేవీ విద్యుత్ తీగలు

● పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో ప్రజలు

ఉదయగిరి, మార్చి 18: నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో తక్కువ ఎత్తులో అనేక దుకాణాలు, నివాసగృహాల పైన 33/11కేవీ మెయిన్‌లైన్ విద్యుత్ తీగలు వెళ్లాయి. వీటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు పూసలకాలనీ హరిజ నవాడ, దిలావర్‌బాయ్, సినిమాహా లు సెంటర్ తదితర ప్రాంతాలలో గృహాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇంటిపైకి వెళితే చేయి అందే ఎత్తు లో ఉండటంతో ఇళ్లపైకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండ లంలోని పలు గ్రామాల్లో సైతం తీగలు వెలడుతూ ఉండటంతో ప్రజలు భయాందోళన చెందు తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వివరిం చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూసలకాలనీలో
ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం - విద్యుత్ శాఖ ఏఈ, కుదూస్

పట్టణంలోని బస్టాండ్ సెంటర్ పూసల కాలనీ, హరిజనవాడ ప్రాంతాల్లో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఇళ్ల యజమానులు వైర్ల మార్పునకు నిబంధన మేర నగదు చెల్లిస్తే వెంటనే తొలగిస్తామన్నారు.

అగ్రహారంలో కోడ్ ఉల్లంఘన

అనంతసాగరం: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే పేరుతో ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించలేదు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా నాయకులకు సంబంధించిన బోర్డులు ఉండరా దన్నారు. సోమవారం వాటిని తొలగించేలా చర్యలు తీసుకొంటామన్నారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రారంభించారు కానీ.. తలుపులు తీయలేదు !

లింగసముద్రం, మార్చి 18 : మండలంలోని పెంట్రాల గ్రామంలో ఈనెల 6న నాలుగు ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించారు.కానీ ఈ ఆ కార్యాలయాల సిబ్బంది నేటి వరకు అందులో చేరలేదు. ఈ గ్రామంలో ఆర్‌బీకే, పాల కేంద్రం, హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలను నిర్మించిన కాంట్రాక్టరు వాటిని అధికారులకు అప్పగించారు. వాటిని ఈ నెల 6న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ప్రారంభించారు.అయితే ఈ భవనాలకు విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. డిజిటల్ లైబ్రరీకి సిబ్బంది కానీ. కంప్యూటర్లు గానీ, ఇతర సదుపాయాలు గానీ లేవు. దీన్ని మహిళా సంఘాలు వినియోగించుకోవాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖికంగా ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. కాగా ఈ కార్యాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకొంటామని ఎంపీడీవో యు శేషుబాబు తెలిపారు.


పెంట్రాలలో ప్రారంభోత్సవం అనంతరం మూతపడిన ప్రభుత్వ కార్యాలయాలు

కనిగిరిలో బుర్రాను తిరస్కరిస్తే ఇక్కడకు పంపారు!

కందుకూరు, మార్చి 18: కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పెద్ద అవినీతిపరుడని, అక్రమాలు, భూకబ్జాలతో రూ.కోట్లు దోచుకున్నాడని టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. బుర్రాను ఓడించి తీరుతామని కనిగిరి ప్రజలు హెచ్చరించటంతో జగన్మోహనరెడ్డి ఆయన్ను కందుకూరు పంపారని ఆయన ఆరోపించారు. నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌లతో కలిసి సోమవారం ఆయన టీడీపీ కార్యాలయానికి వచ్చి స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బుర్రా మధు వ్యవహారశైలి కారణంగా కందుకూరులో రాజకీయ వాతావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, చల్లా శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య పాల్గొన్నారు.

● **శివరామకృష్ణకు పరామర్శ**

కందుకూరులో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించి గాయపరచిన కనమర్లపూడి శివరామకృష్ణ కుటుంబ సభ్యులను ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. అక్కడి నుంచే పోలీసు అధికారులతో మాట్లాడారు. శివరామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

● **కార్యకర్తల అభీష్టం మేరకే నడుచుకుంటా...**

'టీడీపీ అభివృద్ధే ధ్యేయంగా ఊరూరా తిరిగి పనిచేశాం... కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపటంకోసం శాయశక్తులా పనిచేశాం... అయితే అభ్యర్థి ఎంపిక విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నందున వారి అభిప్రాయాలు తెలుసుకుని అందుకనుగుణంగానే నడుచుకుంటాం'.. అని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి రాజేష్ కార్యాలయంలో టీడీపీ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. మున్సిపల్ మాజీ చైర్మన్ బూర్సు మాలకొండయ్య, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సోదరుడు దివి రమేష్, మాజీ ఎంపీపీ సలహాదారు పొడపాటి శ్రీను, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకుడు ఆవుల నరసింహారావు, మర్రిబోయిన వెంకయ్య, పెనుగొండయ్య, పొడపాటి వంశీ, తానికొండ ఆంజనేయులు, ఇంటూరి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు మంచి అవకాశాలు ఉన్నా అభ్యర్థి ఎంపిక విషయంలో అందరు నాయకుల అభిప్రాయం, ప్రజాభిప్రాయం తీసుకోకుండా పార్టీ ఏకపక్షంగా అభ్యర్థి ప్రకటన చేసిందన్నారు. ఈ విషయంలో పునః సమీక్ష చేయాలని అభిప్రాయపడ్డారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు, పక్కన రాంభూపాల్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు

● **రాజేష్‌తో నేతల భేటీ**

అంతకుముందు నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయరు రూప్‌కుమార్ యాదవ్‌లు ఇంటూరి రాజేష్ కార్యాలయానికి చేరుకుని ఆయనతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపిక జరిగిన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇక్కడి పరిస్థితులను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని, వారం రోజులు సమయం ఇవ్వాలని వారు కోరారు.

ఆర్టీసీ కార్మిక నాయకుడు మస్తాన్ మృతి



కావలి టౌన్, మార్చి 19: ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా నాయకుడు ఎస్‌కే మహబూబ్ మస్తాన్ (59) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మస్తాన్ మరణంతో సోమవారం ఆర్టీసీ అధికారులు, కార్మికులు సంతాపం తెలిపారు. డీఎం రావూరు శ్రీనివాసులు, ఎన్ఎంయూ నాయకులు రఘునందనరెడ్డి, కార్గో ఇన్‌చార్జ్ రవిప్రకాష్ తదితరులు మస్తాన్ మృతికి సంతాపం తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండే మస్తాన్ మృతి బాధాకరమని స్నేహితులు పేర్కొన్నారు.

248 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మార్చి 18: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 260పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 248బేళ్ల కొనుగోలు చేశారు. సీఆర్-7, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 12బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.230, కనిష్ఠ ధర రూ.223, సగటు ధర రూ.229.66గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ అదాలత్ వాయిదా

లింగసముద్రం, మార్చి 18: లింగసముద్రంలో మంగళవారం నిర్వహించాల్సిన విద్యుత్ అదాలత్ వాయిదా వేసినట్టు కందుకూరు విద్యుత్ ఈఈ ఏ వీరయ్య తెలిపారు.ఎన్నికల కోడ్ కారణంగా ఈ అదాలత్‌ను వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు.

వ్యక్తిగతంగా సహకరించి ఓటు వేయండి


గిరిజనులను ఓటు అడుగుతున్న విష్ణు

అల్లూరు, మార్చి 18 : రానున్న ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నారని, వ్యక్తిగతంగా సహకరించి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరు పట్టణంలోని సింగారెడ్డిదిన్నె, బూదురుగుంట, యర్రప్పగుంట గిరిజన కాలనీల్లో ఆయన తన సతీమణి శివప్రియతో కలిసి సోమవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తాను పోటీచేసే ఎన్నికల గుర్తు త్వరలో తెలియజేస్తానన్నారు. తాను ప్రతి ఒక్కరికి సహకారాన్ని అందించి ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, అరుగుంట శశిరెడ్డి, బూదరు శీనయ్య, లక్ష్మణరాజు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం..!



అల్లూరు, మార్చి 18 : మన ఓటు మనమే వేసుకుందాం... అనే నినాదంతో కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ప్రచారం చేపట్టారు. సోమవారం అల్లూరు మండలంలోని గ్రద్దగుంట, బట్రకాగొల్లు, నార్తుఆములూరు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోవూరు బాబు, కావూరు బంగారయ్య, కప్పల నవీన్‌కుమార్, కాకాని రంగయ్య, ఎల్లు సుబ్రహ్మణ్యం, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం !

బిట్రగుంట, మార్చి 18: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని ఆర్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఎస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోమవారం క్లీన్‌అండ్‌గ్రీన్‌లో భాగంగా గౌరవరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, సర్పంచు రాధిక, అంగన్‌వాడీ కార్యకర్త మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ దందాను అడ్డుకోవాలని ధర్నా

కావలి, మార్చి18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కూడా అధికారపార్టీ నేతల గ్రావెల్ దందా ఆగలేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. అక్రమ దందాను నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం దళితనేతలు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆములూరు, తిప్ప, బుడంగుంట తదితర ప్రాంతాల్లోని బడుగుల భూముల్లో విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వుకుని రూ.కోట్లు గడిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, తహసీల్దార్, వీఆర్వోలు పట్టించుకోక పోవటంతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుందన్నారు. గ్రావెల్ మాఫియాను అరికట్టకపోతే తాము ఈసీ దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో కోవూరు బాబు, సాల్మన్, కాకి వెంకయ్య, జడ్డా వాసు, బంగారయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత నేతలు, తదితరులు

ప్యాకేజీల కోసం కావ్యను విమర్శిస్తే ఊరుకోం : టీడీపీ

కావలి, మార్చి18: ప్యాకేజీల కోసం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని టీడీపీ నేతలు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నాయకులు ఉప్పుటూరు బాలగురుస్వామి, జ్యోతిబాబూరావు, చవల రామకృష్ణ, దావులూరి దేవకుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు, తిరువీధి ప్రసాద్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అరాచకాలు, విధ్వంసక పాలనను సాక్ష్యాధారాలతో సహా రుజువు చేయగలమన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి విజయం ఖాయం కావటంతో దాన్ని జీర్ణించుకోలేక ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. ప్యాకేజీలు తీసుకుని ఎవరంటే వారు సోషల్‌మీడియాను అడ్డుపెట్టుకుని వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ఆత్మకూరు నాగరాజు, తటవర్తి వాసు, షేక్ మస్తాన్, గుండ్లపల్లి శివాజీ, కోట రమేష్, ఏటూరి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

జాతీయ సాంకేతిక పోటీల్లో 'ప్రకాశం'కు బహుమతులు

కందుకూరు, మార్చి 18: ఒంగోలు సమీపంలోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో రెండురోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక పోటీల్లో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రెండు విభాగాలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి ఎస్ఎస్ మీరావలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈఈ మూడవ సంవత్సరం విద్యార్థులు పైథాన్ లాంగ్వేజ్ ఆలంబనగా రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన టెక్నాలజీతో రూపొందించిన ప్రాజెక్టు ఎక్స్ షోకు ఆర్. తనూజ, కె. వినోద్‌లు ప్రథమ బహుమతిని అందుకున్నారన్నారు. అలాగే టీ. సౌజన్య, జీవీ శ్రావణిలు రూపొందించిన సౌండ్ బ్యాటరీ పత్ర విశ్లేషణ ద్వితీయ బహుమతిని అందుకుందన్నారు. అలాగే మెకానికల్ విభాగం విద్యార్థులు నానో రోబో టెక్నాలజీతో రూపొందించిన పత్ర విశ్లేషణలో రోబోకు ద్వితీయ బహుమతి లభించిందని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్‌లు అభినందించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థులు

● **ఘనంగా వార్షికోత్సవం**

ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బుల్లితెర నటులు, యాంకర్స్ శరత్, సౌమ్యలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామయ్యను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీ నివాస్‌లు నర్సింగ్ కళాశాల నిర్వాహకురాలు డాక్టరు కంచర్ల ఇందిరాదేవి, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.